Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 255 మేడ్చల్ మల్కాజ్‌గిరి 4 అక్టోబర్ 2023 బుధవారం పేజీలు : 4

## తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ..

### శ్రీవారి దర్శనానికి ఎన్ని గంటల సమయం పడుతోందంటే..

తిరుపతి : తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. నేడు (మంగళవారం) శ్రీవారి దర్శనం కోసం 22 కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. స్వామి వారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. ఇక నిన్న (సోమవారం) 80,551 మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిన్న శ్రీవారి హుండీ ఆదాయం 4.27 కోట్లు వచ్చినట్టు తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది.

# బిఆర్ఎస్‌తో పొత్తా... ఆ ప్రసక్తే లేదు




## భాజపా జనగర్జన సభలో ప్రధాని మోదీ

ఇందూరు: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ప్రధాని మోదీ ఘాటు విమర్శలు చేశారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల తర్వాత కేసీఆర్ వైఖరి పూర్తిగా మారిపోయిందన్నారు. కేసీఆర్ దిల్లీ వచ్చి తనను కలిశారని, ఎన్డీయేలో చేరతామని, తెలంగాణలో కేటీఆర్‌ను ఆశీర్వదించాలని కోరినట్లు చెప్పారు. అయితే, ఇది రాజరికం కాదని చెబుతూ, భారాసతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని ఆ రోజే తేల్చి చెప్పినట్లు మోదీ వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన.. ఇందూరు గిరిరాజ్ కళాశాలలో ఏర్పాటు చేసిన భాజపా జనగర్జన సభలో ప్రసంగించారు. "ఇంతకు ముందెప్పుడూ చెప్పని ఓ రహస్యం ఇవాళ మీకు చెబుతున్నా. జీహెచ్‌ఎంసీ ఎన్నికల తర్వాత కేసీఆర్ వైఖరి పూర్తిగా మారిపోయింది. జీహెచ్‌ఎంసీ ఎన్నికల తర్వాత కేసీఆర్ దిల్లీ వచ్చి నన్ను కలిశారు. నాపై ఎంతో ప్రేమ ఒలకబోశారు. కేసీఆర్ గతంలో ఎన్నడూ అంత ప్రేమ చూపలేదు. అది ఆయన వ్యక్తిత్వంలోనే లేదు. నా నేతృత్వంలోనే దేశం దూసుకుపోతోందని కేసీఆర్ భజన చేశారు. తెలంగాణ పాలన పగ్గాలు కేటీఆర్‌కు ఇస్తానని చెప్పారు. ఆయన్ను ఆశీర్వదించాలని కోరారు. ఇది రాజరికం కాదని నేను కేసీఆర్‌కు గట్టిగా చెప్పా. ప్రజలు ఆశీర్వదించిన వారే పాలకులని, భారాసతో పొత్తు పెట్టుకోబోమని తేల్చి చెప్పాను. జీహెచ్‌ఎంసీ మేయర్ ఎన్నికలో మద్దతివ్వాలని అడిగారు. విపక్షంలోనైనా కూర్చుంటాం కానీ, మద్దతు ఇవ్వనని తెగేసి చెప్పాను. తెలంగాణ ప్రజలకు ద్రోహం చెయ్యనని కేసీఆర్‌కు స్పష్టం చేశాను. కేసీఆర్ కోరినా.. భారాస ఎన్డీయేలో చేరేందుకు నేను అంగీకరించలేదు." అని మోదీ అన్నారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల తర్వాత తెలంగాణ తరఫున గట్టిగా పోరాడాలని భాజపా నిర్ణయించిందని మోదీ అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి భాజపా కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో ఆస్పత్రులు, కొత్త రైల్వే లైన్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఎంతో మంది బలిదానాలతో తెలంగాణ సాకారమైందన్న మోదీ.. రాష్ట్ర ప్రజల సంపదను ఓ కుటుంబం దోచుకుంటోందని విమర్శించారు. ప్రజాస్వామ్య కుటుంబాన్ని భారాస కుటుంబ స్వామ్యంగా మార్చిందని మండిపడ్డారు. తెలంగాణ ఏర్పడిన ప్రతిఫలాన్ని ఒక కుటుంబమే అనుభవిస్తోందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణ తల్లులు, చెల్లెమ్మలు భాజపాను ఆశీర్వదించాలని ప్రధాని మోదీ కోరారు. కొన్ని రోజుల క్రితమే మహిళా రిజర్వేషన్ల బిల్లు రూపొందించుకున్నట్లు గుర్తు చేసిన ఆయన. భరతమాత రూపంలో సభకు వచ్చిన మహిళలకు అభినందనలు తెలిపారు. " మహిళలు పెద్ద సంఖ్యలో రావడం నా అదృష్టంగా భావిస్తున్నా. భవిష్యత్‌లో మరింత మహిళా శక్తిని మనం చూడనున్నాం. తెలంగాణ తల్లులు, చెల్లెమ్మలు ఓట్ల రూపంలో భాజపాను ఆశీర్వదించాలి. తెలంగాణ ప్రజల్లో ఎంతో శక్తిసామర్థ్యాలు, తెలివితేటలు ఉన్నాయి. ప్రపంచానికి కొవిడ్ వ్యాక్సిన్ అందించిన ఘనత తెలంగాణదే" అని మోదీ అన్నారు.

తెలంగాణ ఏర్పడిన ప్రతిఫలాన్ని ఒక కుటుంబమే అనుభవిస్తోందని, కేసీఆర్, ఆయన కుమారుడు, కుమార్తె, అల్లుడు మాత్రమే ధనికులయ్యారు. తెలంగాణ యువత కుటుంబ పాలనకకు మరో అవకాశం ఇవ్వొద్దని మోదీ పిలుపునిచ్చారు.

## ఉచిత కరెంటును ఉత్త కరెంటు చేసిన కాంగ్రెస్: మంత్రి హరీశ్ రావు

గజ్వేల్: కాంగ్రెస్ హయాంలో ఉచిత కరెంటును ఉత్త కరెంటు చేశారని మంత్రి హరీశ్ రావు అన్నారు. హస్తం పార్టీ పాలనలో మోటార్లకు 3 గంటలే కరెంటు వచ్చేదని విమర్శించారు. ఆ పార్టీ మరోసారి అధికారంలోకి వస్తే కరెంటు కోతలు తప్పవన్నారు. గజ్వేల్‌లో కొత్తగా నిర్మించిన రింగు రోడ్డును, పత్తి మార్కెట్ యార్డు, సబ్‌స్టేషన్‌ను మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రైతుల పట్ల ప్రేమ ఉన్న ఒకే ఒక వ్యక్తి కేసీఆర్ మాత్రమేనన్నారు.

గజ్వేల్ ప్రాంతంలో నెలకొన్న 50 ఏండ్ల నీటి కష్టాన్ని ముఖ్యమంత్రి తొలగించారని చెప్పారు. దేశంలో గజ్వేల్ పేరు, ప్రతిష్ఠ నిలబెట్టిన ఘనత సాధించారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజారిటీతో సీఎం కేసీఆర్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.

**సీఎం కేసీఆర్‌ను లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపిద్దాం :** కాంగ్రెస్ పార్టీ హయాంలో ఉచిత కరెంటును ఉత్త కరెంటు చేశారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు ధ్వజమెత్తారు. బండ మైలారం గ్రామ రూపురేఖలు మార్చింది సీఎం కేసీఆర్ అని స్పష్టం చేశారు. మంగళవారం ములుగు మండలం బండ మైలారం పారిశ్రామిక వాడలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, ఎఫ్డీసీ చైర్మన్ ప్రతాప్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. గ్రామస్తులు, బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గజ్వేల్ ప్రాంతంలో నెలకొన్న 50 ఏండ్ల నీటి కష్టాన్ని కేసీఆర్ తొలగించారని, దేశంలో గజ్వేల్ పేరు, ప్రతిష్టలు నిలబెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందననారు. వందల కోట్ల నిధులు కేటాయించి ఎంతో వెనుకబడిన గజ్వేల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని స్పష్టం చేశారు. కండ్ల ముందు జరుగుతున్న అభివృద్ధిని చూసి ఆదరించాలన్నారు.



ఈ సారి జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజారిటీతో కేసీఆర్‌ను గెలిపించాలని గ్రామ ప్రజలకు మంత్రి హరీశ్ రావు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## బీఎస్పీ అభ్యర్థుల జాబితా విడుదల.. ప్రవీణ్ కుమార్ పోటీ ఎక్కడి నుంచంటే..?

హైదరాబాద్: త్వరలో జరగనున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి బహుజన్ సమాజ్ పార్టీ సిద్ధమైంది. ఈ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను మంగళవారం సాయంత్రం విడుదల చేసింది. బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డా.ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌తో పాటు మొత్తం 20 మంది అభ్యర్థుల పేర్లను పార్టీ ప్రకటించింది. ఈ ఎన్నికల్లో ప్రవీణ్ కుమార్ సిర్పూర్ స్థానం నుంచి బరిలో దిగనున్నారు.



**బీఎస్పీ అభ్యర్థుల తొలి జాబితా ఇదే..** సిర్పూర్ (జనరల్) - డా. ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్, జహీరాబాద్ (ఎస్సీ)- జంగం గోపి, పెద్దపల్లి (జనరల్)- దాసరి ఉషా, తాండూర్ (జనరల్)- చంద్రశేఖర్ ముదిరాజ్, దేవరకొండ (ఎస్టీ)- డా. ముదావత్ వెంకటేశ్ చౌహాన్, చొప్పదండి (ఎస్సీ)- కొంకటి శేఖర్, పాలేరు (జనరల్)- అల్లిక వెంకటేశ్వరరావు యాదవ్, నకిరేకల్ (ఎస్సీ)- మేడి ప్రియదర్శిని, వైరా (ఎస్టీ)- బానోత్ రాంబాబు నాయక్, ధర్మపురి (ఎస్సీ) - నక్కా విజయ్ కుమార్, వనపర్తి (జనరల్)- నాగమోని చెన్న రాములు ముదిరాజ్, మానకొండూర్(ఎస్సీ) -ఎన్. రాంచందర్, కోదాడ (జనరల్) - పిలుట్ల శ్రీనివాస్, నాగర్‌కర్నూలు (జనరల్)- కొత్తపల్లి కుమార్, ఖానాపూర్ (ఎస్టీ) - బన్సిలాల్ రాథోడ్, అందోల్ (ఎస్సీ) - ముప్పారపు ప్రకాశం, సూర్యాపేట (జనరల్)- వట్టె జానయ్య యాదవ్, వికారాబాద్ (ఎస్సీ) -గడ్డం క్రాంతి కుమార్, కొత్తగూడెం (జనరల్) -ఎర్రా కామేశ్, జుక్కల్ (ఎస్సీ)- ప్రద్యు కుమార్ మహదేవ్‌రావు ఏకాంబర్.

# కరెంటు కష్టాలు కావాలో్నా... 24 గంటలు కరెంటు కావాలో్నా... ఆలోచించండి...




## వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ ఇవ్వాలన్నదే కేసీఆర్ ధ్యేయం

జగిత్యాల : ఎస్సారెస్పీ ఆయకట్టు కింద నీటి యుద్ధాలు లేకుండా చేసింది సీఎం కేసీఆర్ మాత్రమే అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లాలో ఎస్పీ కార్యాలయం, డబుల్ బెడ్రూం ఇండ్లను ప్రారంభించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. జగిత్యాల నియోజకవర్గంలో వరి పండించే రైతులు ఉన్నారని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఒకనాడు ఎస్సారెస్పీ కాలవ మీద నీటి కోసం రైతుల మధ్య యుద్ధాలు జరిగేవి. ఎస్సారెస్పీ కాలవ మీద ఉన్న మోటార్ల వైర్లు కోసి, మోటార్లను కాలవల్లో తోసేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది. ఇవాళ ఆ పరిస్థితి లేదు. ఎన్ని మోటార్లు పెట్టినా.. ఎన్నీ నీళ్లు తీసుకున్నా అడగడం లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. రైతులకు నాణ్యమైన 24 గంటల ఉచిత కరెంట్ అందిస్తున్నామని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు గోస ఉండే. ఆరు గంటల కరెంట్ అన్నరు.. ఒక్కరోజు చక్కగా ఇవ్వలేదు. తెలంగాణలో ఉన్నదంతా చిన్నసన్నకారు రైతులు. మూడు ఎకరాలకు కంటే ఎక్కువ లేదు. వీళ్లకు 24 గంటల కరెంట్ అవసరం లేదు.. మూడు గంటల కరెంట్ చాలు అని రేవంత్ రెడ్డి అంటున్నారు. అందుకే ఇలాంటి దొంగల పట్ల జాగ్రత్తగా ఉండాలి. కరెంట్ కష్టాలు కావాలంటే కాంగ్రెసోళ్ల గురించి ఆలోచించాలి. 24 గంటల కరెంట్ కావాలంటే రైతు నాయకుడు, రైతుబిడ్డ కేసీఆర్‌కే ఓటేయాలి అని కేటీఆర్ సూచించారు. సాగునీటి కోసం జగిత్యాల – కోరుట్ల మధ్య పంచాయితీ, కోరుట్లకు బాల్కొండకు మధ్య, జగిత్యాలకు చొప్పదండికి, పెద్దపల్లికి హుజురాబాద్‌కు మధ్య పంచాయితీ ఉండేదని కేటీఆర్ గుర్తు చేశారు. రైతులు మొత్తం కాల్వల మీద నిలబడి యుద్ధాలు చేసిన పరిస్థితి. ఇవాళ కాలువల నిండా నీళ్లు పారుతున్నాయి.

ఆయకట్టును బ్రహ్మాండంగా కాపాడి నీళ్ల యుద్ధాలు లేకుండా చేశారు కేసీఆర్ అని కేటీఆర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ గెలిస్తే కేసీఆర్ ప్రభుత్వాన్ని కాపాడుతాడు.. కానీ కాంగ్రెస్ గెలిస్తే పది మంది ముఖ్యమంత్రులు ఉంటారని కేటీఆర్ తెలిపారు. అలాంటి పార్టీని పొరపాటున కూడా నమ్మొద్దు. 4 లక్షల 25 వేల మంది బీడీ కార్మికులకు పెన్షన్లు ఇస్తున్నాం. ఏ ప్రధాని, ఏ ముఖ్యమంత్రికి కూడా పెన్షన్లు ఇవ్వాలన్న ఆలోచన ఎందుకు రాలేదు? గతంలో బీడీ కార్మికులను ఎవరైనా పట్టించుకున్నారా? కేసీఆర్ వచ్చిన తర్వాతనే బీడీ కార్మికులకు గుర్తింపు వచ్చిందని కేటీఆర్ పేర్కొన్నారు.

## జగిత్యాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న మంత్రి కేటీఆర్



# సంపాదకీయం

## భారత్ - కెనడా ఉద్రిక్తతలు

## భారతీయ విద్యార్థులపై ప్రభావమెంత?

ఖలిస్తానీ టైగర్ ఫోర్స్ నేత హరదీప్ సింగ్ నిజ్జర్ ను భారత ప్రభుత్వ ఏజెంట్లే చంపారంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన విమర్శలు రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలను సృష్టించిన సంగతి తెలిసిందే. ఇందుకు నిరసనగా కెనడా తమ దేశంలోని భారత దౌత్యవేత్తను బహిష్కరించగా.. భారత్ కూడా ఇందుకు దీటుగా బదులిచ్చింది. కెనడా సీనియర్ దౌత్యవేత్తను మన దేశం నుంచి బహిష్కరించింది. అంతేకాకుండా కెనడియన్లకు వీసాల జారీని నిలిపేసింది. అంతేకాకుండా కెనడాలో ఇప్పటికే ఉన్న భారతీయులు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. కెనడా ఉగ్రవాదులకు స్వర్గధామంగా మారిందని.. కాబట్టి తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. కాగా ప్రపంచంలో అమెరికా తర్వాత కెనడాలోనే భారత విద్యార్థులు ఎక్కువ మంది విద్యనభ్యసిస్తున్నారు. ముఖ్యంగా పంజాబ్, హరియాణా, రాజస్థాన్, ఢిల్లీకి చెందిన విద్యార్థులే కెనడాలో ఉన్న భారతీయ విద్యార్థుల్లో ఎక్కువ మంది అని చెబుతున్నారు. 2008 వరకు ప్రతి సంవత్సరం 38,000 మంది పంజాబీలు మాత్రమే కెనడా వీసా కోసం దరఖాస్తు చూసుకునేవారని, ఇప్పుడు ఆ సంఖ్య భారీగా పెరిగిందని నివేదికలు పేర్కొంటున్నాయి. ఇప్పుడు కెనడా – భారత్ ఉద్రిక్తతల ప్రభావం విద్యార్థులపైన కూడా పడుతోందని వార్తా కథనాలు పేర్కొంటున్నాయి. ఇరు దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల వల్ల కెనడాలో చదువుతున్న తమ పిల్లల విద్యపై ప్రభావం పడుతుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పిల్లల చదువు కోసం ఖర్చు చేసిన డబ్బుపై తల్లిదండ్రులలో ఆందోళన మొదలైందని 'ఖల్సా వోక్స్' పేర్కొంది. పంజాబ్ విద్యార్థుల నుంచి కెనడా ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఏటా రూ. 68,000 కోట్లు ఆర్జిస్తోందని ఖల్సా వోక్స్ తన నివేదికలో వెల్లడించింది. ఖల్సా వోక్స్ నివేదిక ప్రకారం.. గత సంవత్సరం మొత్తం 2,26,450 వీసాలను కెనడా ఆమోదించింది. ఇందులో సుమారు 1.36 లక్షల మంది విద్యార్థులు పంజాబ్ కు చెందిన వారే కావడం గమనార్హం. ఈ విద్యార్థులు 2–3 ఏళ్ల పాటు కెనడాలో ఉండి వివిధ కోర్సులను చదువుతున్నారు. మొత్తం మీద కెనడాలోని పలు విద్యా సంస్థల్లో ప్రస్తుతం 3.4 లక్షల మంది పంజాబీ విద్యార్థులు ఉన్నారు. కెనడాకు వెళ్తున్న భారతీయుల్లో దాదాపు 60 శాతం మంది పంజాబీలే ఉన్నారని అసోసియేషన్ ఆఫ్ కన్సల్టెంట్స్ ఫర్ ఓవర్సీస్ స్టడీస్ చైర్మన్ కమల్ భూమ్లా వెల్లడించారు. గత సంవత్సరం 1.36 లక్షల మంది విద్యార్థులు కెనడా వెళ్లారని తెలిపారు. వీరిలో ప్రతి విద్యార్థి సగటున 10,200 కెనడియన్ డాలర్లను గ్యారెంటీడ్ ఇన్వెస్ట్‌మెంట్ సర్టిఫికేట్ ఫండ్స్ గా డిపాజిట్ చేస్తున్నారని చెప్పారు. దీంతోపాటు వార్షిక రుసుముంగా 17,000 కెనడియన్ డాలర్లు చెల్లిస్తారని పేర్కొన్నారు. కెనడాలో ఇప్పుడు తీవ్రంగా ఇళ్ల కొరత నెలకొందని తెలుస్తోంది. ఉద్యోగాలు లేకపోవడం, ద్రవ్యోల్బణం కూడా తోడు కావడంతో భారత విద్యార్థులు అక్కడ కష్టాలు పడుతున్నారని వార్తలు వచ్చాయి. ముఖ్యంగా ఇటీవల కెనడా వెళ్లిన భారతీయ విద్యార్థులు అద్దె ఇళ్లు దొరక్క డోర్ టు డోర్ తిరుగుతున్నారని చెబుతున్నారు. ముఖ్యంగా భారతీయ విద్యార్థులు ఎక్కువగా ఉండే నగరాల్లో ఒకటైన ఒంటారియోలో ఇళ్ల కొరత తీవ్రంగా ఉందని వార్తా కథనాలు పేర్కొంటున్నాయి. కెనడాలో 3,45,000 ఇళ్లకు కొరత ఉందని తెలుస్తోంది. దీంతో అక్కడ ఇంటి అద్దెలు భారీగా పెరిగిపోయాయని సమాచారం. దీంతో విద్యార్థులు ఉండటానికి అద్దె ఇల్లు దొరక్క సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలుస్తోంది. మరోవైపు హిందూ విద్యార్థులు సిక్కులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఉండటానికి మొగ్గుచూపడం లేదని సమాచారం. హిందువులపై ఖలిస్తాన్ సానుభూతిపరులు దాడులకు పిలుపునివ్వడంతో జాగ్రత్తలరీత్యా హిందూ విద్యార్థులు తమ మకాంను సురక్షిత ప్రాంతాలకు మార్చుకోవడానికి మొగ్గుచూపుతున్నారని పేర్కొంటున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో అద్దె ఇళ్లు దొరకడం గగనంగా మారిందంటున్నారు. అద్దెలు భారీగా పెంచేయడంతో విద్యార్థులు భారీగానే ఖర్చు పెట్టాల్సి వస్తోందని వాపోతున్నారు.

# అక్రమ లేఅవుట్లు.. సామాన్యులకు పాట్లు



ఆసిఫాబాద్ : ఈ చిత్రం ఇచ్చోడ మండలం దూబార్‌పేటలోనిది. మొన్నటిదాకా వ్యవసాయ భూమిగా ఉండేది. కొనుగోలు చేసిన వ్యాపారులు ఇక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా లేఅవుట్లు చేశారు. విషయం తెలుసుకున్న అధికారులు అక్కడికి వెళ్లి బండలను నామమాత్రంగా తొలగించారు. ప్రస్తుతం ఆ వెంచర్లలోనే ప్లాట్ల అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ చిత్రం తలమడుగు మండలం దేవాపూర్‌లోనిది. జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉండటంతో భూముల ధరలకు అధిక డిమాండ్ ఉంది. తమకున్న పంట పొలాలను లేఅవుట్లు చేసి ప్లాట్లుగా ఏర్పాటు చేశారు. వీటికి పంచాయతీల నుంచి ఎలాంటి అనుమతులు లేవు. పంచాయతీ సర్పంచితోపాటు కార్యదర్శులు నోటీసులు సైతం ఇచ్చారు. వ్యాపారులు అవేమీ పట్టించుకోకుండా తమపని తాము కానిస్తున్నారు. ఇక్కడ ఎకరం రూ. 25 లక్షల వరకు కొంటున్నారు. ఇందులో రహదారులు, మురుగుకాలువలు పోనూ ప్లాట్లుగా మారిస్తే ఎకరం భూమిలో దాదాపు 15 ప్లాట్లు ఏర్పాటు చేస్తారు. ఒక్క దాని ధర రూ. 7 లక్షల చొప్పున విక్రయిస్తే రూ. 1.05 కోట్లు వస్తుంది. అంటే రూ. 80 లక్షలు లాభం వస్తుంది.

మొన్నటి దాకా పట్టణాల్లో జోరందుకున్న స్థిరాస్తి వ్యాపారం ప్రస్తుతం పల్లెలకు పాకింది. పట్టణాల్లో భారీగా ధరలు పలుకుతుండటం, స్థలాలు అంతగా లేకపోవడంతో వ్యాపారులు పల్లెలపై దృష్టి సారిస్తున్నారు. ముఖ్యంగా జాతీయ రహదారులను ఆనుకొని ఉన్న గ్రామాల్లో సాగు భూములను కొనుగోలు చేసి అక్రమ లేఅవుట్లు వేసి దందాను జోరుగా సాగిస్తున్నారు. పంచాయతీల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారీతిన లేఅవుట్లు చేస్తూ అమాయకులను బురిడీ కొట్టిస్తున్నారు. జిల్లాలో జాతీయ రహదారికి ఆనుకొని ఇచ్చోడ, గుడిహత్నూర్, నేరడిగొండ, తలమడుగు, తాంసి, మావల, జైనథ్ మండలాలు ఉండటంతో భూములకు అధిక ధర పలుకుతోంది. అవసరాల దృష్ట్యా రైతులు సాగు భూములను అమ్ముకుంటున్నారు. కొనుగోలు చేసిన వ్యాపారులు భారీగా లాభం పొందేందుకు లేఅవుట్లు చేస్తున్నారు. పట్టణాల్లో లేఅవుట్లు లేకుండా అనుమతులు లేకుండా ఏ పని సాగదు. ఈ విషయాన్ని గ్రహించిన పలువురు వ్యాపారులు పల్లెల బాట పడుతున్నారు. జిల్లాలోని ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో లేఅవుట్లు కోకొల్లలుగా వెలుస్తున్నాయి. అనుమతులు లేకున్నా ఉన్నట్లుగా చెప్పి స్థలాలు విక్రయిస్తున్నారు. రైతుల నుంచి వ్యాపార సంస్థ పేరుపైకి రిజిస్ట్రేషన్లు కాకముందే హద్దులు ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చకుండా అమ్మకాలు చేస్తున్నారు. అంతేకాకుండా నకిలీ బ్రోచర్లు సృష్టించి అన్ని అనుమతులు ఉన్నట్లు నమ్మిస్తున్నారు. అధికారులు వీటిపై పూర్తిస్థాయిలో దృష్టిసారించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

అనుమతి పొందడం ఇలా..నిబంధనల ప్రకారం వ్యవసాయ భూమిలో లేఅవుట్ చేయాలంటే మొదట భూమి విలువలో మూడు శాతం రుసుము రెవెన్యూ శాఖకు చెల్లించి నాలా(వ్యవసాయేతర భూమి)గా మార్చుకోవాలి. తర్వాత డీటీపీసీ నుంచి అనుమతులు పొంది లేఅవుట్‌లు వేసుకోవాలి.

ప్రజావసరాల నిమిత్తం లేఅవుట్‌లో 30 అడుగుల రహదారులు, వీధి దీపాల ఏర్పాటు, నీటి ట్యాంకు, మురుగు కాలువల నిర్మాణాలు నిర్వాహకులే చేపట్టాల్సి ఉంటుంది. అయితే జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో విరుద్ధంగా లేఅవుట్లు చేశారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు : – శ్రీనివాస్, డీపీవో, ఆదిలాబాద్

జిల్లాలోని ఆయా మండలాల్లో పంచాయతీల అనుమతులు లేకుండా వెలసిన అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకుంటాం. పంచాయతీ పరిధిలో ఎవరు కూడా ప్లాట్లు కొని మోసపోవద్దు నాలా అనుమతులు ఉన్న వాటినే కొనుగోలు చేయాలి. ఇప్పటికే అక్రమ లేఅవుట్లను గుర్తించాం. త్వరలో వాటిపై చర్యలు తీసుకుంటాం. కొనుగోలు చేసిన తర్వాత నాలా అనుమతి ఇవ్వడం సాధ్యం కాదు.

# నిధులు లేక.. నీరందక

ఆసిఫాబాద్ : జిల్లాలో సుమారుగా లక్ష ఎకరాల భూములకు సాగునీరందించే జలాశయాలు ఉన్నాయి. కాలువలు సక్రమంగా లేక నిండా నీరున్నా యాసంగిలో పంటలు ఎండే పరిస్థితి నెలకొంది. నిధుల లేమితో కాలువల ఆధునికీకరణ, పూడికతీత పనులేవీ సాగకపోవడం వల్ల ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల రైతులే తలాకొంత డబ్బులు పోగు చేసుకుని కాలువల్లో పూడిక తీసుకుంటూ నీరు పంటలకు చేరేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. శిథిలమైన కాలువలు, బిగుసుకుపోయిన షట్టర్లు, మూసుకుపోయిన తూములతో పూర్తయిన ప్రాజెక్టులు రైతులకు రిక్తహస్తాన్ని మిగుల్చుతుండగా, అసంపూర్తి పనులతో నీళ్లు రాక మిగతా ప్రాజెక్టులు సైతం అన్నదాతకు కన్నీరే మిగిలిస్తున్నాయి. ఈ బడ్జెట్‌లోనైనా తగినన్ని నిధులు కేటాయించి, ప్రాజెక్టుల పనులు పూర్తి చేయాలని కర్షకులు కోరుతున్నారు. జిల్లాలో 1.02 లక్షల ఎకరాల ఆయకట్టు కలిగిన కుమురం భీం, వట్టివాగు, జగన్నాథ్‌పూర్, పీపీరావు, చెలిమెల మధ్య తరహా సాగు నీటి ప్రాజెక్టులున్నాయి. ఇందులో ఒక్కటీ నిర్ణీత లక్ష్యం మేర భూములకు సాగు నీరందించడం లేదు. ప్రధాన కాలువలకు గండ్లు పడి నీటి విడుదలను నిలిపివేయడం, నిధులు లేక భూములు సేకరించక, పిల్ల, పంపిణీ కాలువలు నిర్మించకపోవడం వల్ల జలాశయంలో నీరున్నా పంటలకు వినియోగించలేని దుస్థితి నెలకొంది. మధ్య తరహా ప్రాజెక్టులతో పాటు, చిన్నతరహా సాటు నీటి ప్రాజెక్టుల కోసం సైతం అధికారులు బడ్జెట్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందులో తిర్యాణి మండలంలోని చెలిమెల, బెజ్జూర్ మండలంలోని బొక్కివాగు, కౌటాల మండలంలోని అర్కగూడ, కెరమెరి మండలంలోని కేస్లగూడతో పాటు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్‌లోని చెరువులు, కాలువల మరమ్మతుల కోసం రూ. 48 కోట్లతో ప్రతిపాదనలు నీటిపారుదలశాఖ అధికారులు సిద్ధం చేశారు. నిధులు విడుదలై, పనులు సకాలంలో పూర్తయితే అన్నదాతల సాగునీటి ఇబ్బందులు తీరినట్లే.

దశాబ్దాల నుంచి నిర్మాణంలోనే...కాగజ్‌నగర్ మండలంలో పెదవాగుపై 2005లో ప్రారంభమైన జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు నేటికీ నిర్మాణ దశలోనే ఉంది. 19 క్రస్ట్‌గేట్లను మాత్రమే అమర్చారు. 29 కిలోమీటర్ల ప్రధాన కాలువ ఇప్పటి వరకు 27 కిలోమీటర్ల మేర పూర్తయ్యింది. 35 కిలోమీటర్ల మేర పంపిణీ కాలువలను నిర్మించాల్సి ఉండగా.. 3 మాత్రమే పూర్తయ్యాయి. 101 ఎకరాల భూమి ఇంకా సేకరించాల్సి ఉంది.

పీపీరావు.. నీళ్లు రావు.. దహెగాం మండలంలోని పీపీరావు జలాశయం 11 వేల ఎకరాలకు నీరందించేంది. 2003లో రూ. 100 కోట్ల వ్యయంతో పూర్తయిన ఈ ప్రాజెక్టు కాలువలు అనేక చోట్ల నామరూపాల్లేకుండా పోయాయి. ప్రస్తుతం 1000 ఎకరాలకు మాత్రమే అతికష్టం మీద నీళ్లు అందుతున్నాయి. కాలువల మరమ్మతుల కోసం అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

కుమురం భీం.. ఆయకట్టు రైతుల నిర్వేదం

45 వేల ఎకరాల ఆయకట్టు కలిగిన కుమురం భీం జలాశయం ఆరు నెలల నుంచి ఎకరం పంట పొలానికి సైతం నీరందించడం లేదు. ప్రధాన కాలువకు వాంకిడి సమీపంలో గత ఆగస్టు నెలలో కురిసిన వర్షాలకు రెండుగండ్లు పడగా నేటికి మరమ్మతులు చేయలేదు. ఈ కారణంగా నీటి విడుదలను నిలిపివేశారు. 77 కిలోమీటర్ల వరకు ఎడమ ప్రధాన కాలువ నిర్మించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 74 కిలోమీటర్లు పూర్తయ్యింది. కుడికాలువ ఏడు కిలోమీటర్ల పూర్తయినా ఆదిలోనే కూలిపోవడంతో చుక్కనీరు రావడం లేదు.

సార్థక నామధేయం.. వట్టివాగు

శిథిలమైన కాలువలు, అడుగడుగునా లీకేజీలు, విరిగిన షటర్‌లకు వట్టివాగు చిరునామాగా మారింది వట్టివాగు. 1977లో చేపట్టిన ప్రాజెక్టు పనులు 1998లో పూర్తయ్యాయి. 25 వేల ఆయకట్టు కలిగిన ఈ జలాశయం ఎన్నడూ 1000 ఎకరాలకు మించి తడపడం లేదు. ఇవి సైతం రైతులు స్వయంగా పూడిక తీసుకుంటూ అతికష్టం మీద పంటలకు నీరందిస్తున్నారు. గతేడాది బడ్జెట్‌లో సైతం ఈ ప్రాజెక్టుకు నిధులేమి కేటాయించలేదు.

# పట్టుతప్పితే ప్రాణాలకే ప్రమాదం

ఆసిఫాబాద్ : ఆదిలాబాద్ పట్టణంలో రహదారుల పక్కన నాలాలకు రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా మారాయి. రోడ్డుపై వెళ్తున్న వాహనాలు అదుపు తప్పినా, జారినా నాలాలో పడిపోయే పరిస్థితులున్నాయి. హైదరాబాద్‌లో గతంలో నాలాల్లో పడి పలువురు గల్లంతైన సంఘటనలున్నాయి. ఈ నేపథ్యంలో పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ నాలాలకు రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాలాల్లో పడి ఏవైనా ప్రమాదాలు జరిగినా సంబంధిత పురపాలక అధికారులదే బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రమాదకరంగా ఉన్న మురుగు కాలువలు, నాలాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని, ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వర్షాలతో పొంచి ఉన్న ముప్పు



జిల్లా కేంద్రంలో కొన్నిచోట్ల రోడ్డు పక్కనున్న పాత నాలాలకు ఎలాంటి రక్షణ చర్యలు లేవు. భుక్తాపూర్‌లో రెండుచోట్ల, శాంతినగర్‌లో రెండుచోట్ల, తాటిగూడలో నాలాలు ప్రమాదకరంగా ఉన్నాయి. వర్షాలు పడితే ఈ నాలాల్లో వరదనీరు ఉద్ధృతంగా ప్రవహిస్తుంది. పాదచారులు ఎవరైనా పట్టుతప్పినా, వాహనాలు అదుపుకాకపోయినా అందులో పడిపోతారు. పిల్లలు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు పడిపోతే గల్లంతయ్యే అవకాశాలున్నాయి. అక్కడ రక్షణ చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు

# సాంకేతిక పొరపాటు.. పన్ను పోటు

ఆసిఫాబాద్ :మావల గ్రామ పంచాయతీ నుంచి పట్టణ పరిధిలోకి వచ్చిన ప్రాంతంలో షాప్ కేటగిరీకి చెందిన ఓ భవనాన్ని ఆస్తి పన్ను అసెస్‌మెంట్ చేసి ఆన్‌లైన్ చేస్తే దాదాపు రూ. 10వేలకు పైగా వచ్చింది. రూ. 2 వేల లోపే రావాల్సిన పన్ను ఎక్కువగా నమోదు కావడంతో అధికారులు అవాక్కయ్యారు. ఇది పట్టణంలో విలీనమైన బెల్లూరి ప్రాంతం. ఇక్కడ ఓ గుడిసెకు బల్దియా రెవెన్యూ సిబ్బంది కొత్తగా ఆస్తి పన్ను మదింపు చేసి ఆన్‌లైన్ చేశారు. వాస్తవానికి ఆ గుడిసెకు రూ. 600–700 పన్ను రావాలి. కానీ రూ. 4 వేలకు పైగా రావడంతో అంత పెద్ద మొత్తంలో ఎలా వచ్చిందని సిబ్బందే ఆశ్చర్యపోయారు. పూరి గుడిసెకు రూ. 4 వేలు.. ఆర్‌సీసీ భవనానికి రూ. 10 వేలు.. షాప్ బిల్డింగ్ అయితే రూ. 15 వేలు.. ఇవన్నీ ఆస్తి పన్నులంటే ఎవరైనా అదిరిపడతారు. ఇంటి యజమాని చేతిలో బిల్లు పెడితే కంగుతింటారు. అయితే ఈ వ్యవహారం అక్కడిదాకా వెళ్లలేదు. మావల పంచాయతీ నుంచి విలీనమైన కాలనీలు, బెల్లూరి పరిధిలో ఆస్తి పన్నును మదింపు చేసి ఆన్‌లైన్ చేసే సమయంలోనే జరిగిన పొరపాటని బల్దియా అధికారులు గుర్తించారు. సాంకేతిక తప్పిదాన్ని సవరించి, ఎక్కువగా వచ్చిన ఆస్తి పన్ను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(సీడీఎంఏ) లేఖ రాశారు.

భువన్ సర్వేతో వెలుగులోకి..



ఆదిలాబాద్ పురపాలికలో 2018లో సమీప పంచాయతీలు, కాలనీలను విలీనం చేశారు. అందులో అనుకుంట, రాంపూర్ పంచాయతీలు, బెల్లూరి అనుబంధ గ్రామం పూర్తిగా విలీనం కాగా.. మావల, బట్టిసావర్గాం గ్రామాలు తప్ప వాటి పరిధిలోకి వచ్చే కాలనీలన్నీ పట్టణంలో కలిశాయి. విలీన ప్రాంతాలకు సంబంధించిన రికార్డులన్నింటినీ బల్దియా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి మూడేళ్ల వరకు విలీన ప్రాంతాల ఆస్తి పన్నులు పాతవాటినే వసూలు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంతో గడువు ముగియనుంది. వచ్చే సంవత్సరం నుంచి కొత్తగా మదింపు చేసిన ఆస్తిపన్నులు అమల్లోకి రానున్నాయి. దీంతో బల్దియా అధికారులు భువన్ సర్వే చేస్తున్నారు. ఇంటి కొలతలు తీసుకుని ఆన్‌లైన్‌లో ఆస్తిపన్ను నమోదు చేస్తున్నారు. ఈ క్రమంలో అనుకుంట, రాంపూర్, బట్టిసావర్గాం పరిధిలో ఇళ్లకు ఆస్తిపన్ను మదింపు సరిగానే జరిగింది. మావల, బెల్లూరి ప్రాంతాల్లోని ఆస్తులకు వాస్తవంగా రావాల్సిన పన్ను కన్నా ఎక్కువగా నమోదు అవుతుండటాన్ని గుర్తించారు.

విలీనానికి ముందే సమస్య

ఆస్తిపన్ను మదింపులో ఇంటి నిర్మాణ రకం, విస్తీర్ణం, నివాస, నివాసేతర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. పట్టణంలో జోన్ల వారీగా నిర్ణయించిన ధరలను క్యాపిటల్ విలువతో లెక్కించగా ఆస్తి పన్ను వస్తుంది. ఈ క్యాపిటల్ వ్యాల్యూ సాధారణంగా 0.12 శాతంగా ఉంటుంది. కానీ మావల, బెల్లూరిలో అది 0.70గా ఉంది. ఈ కారణంగానే ఆ ప్రాంతాల్లో ఆస్తి పన్ను అయిదారు రెట్లు అధికంగా వస్తోంది. పట్టణంలో విలీనం కాకముందే అంటే 2018కి పూర్వమే ఆ పంచాయతీల్లో ఆన్‌లైన్‌లో క్యాపిటల్ విలువను తప్పుగా నమోదు చేశారు. అక్కడ ఈ విధానం అమలు కాలేదు. ఆన్‌లైన్‌లో జరిగిన పొరపాటును సవరించకుండానే విలీన ప్రక్రియ ముగియడంతో మూడేళ్ల తర్వాత ఈ సమస్య బయటపడింది.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం : – ఎ.శైలజ, పురపాలక కమిషనర్

పట్టణంలో విలీనమైన మావల, బెల్లూరిలో క్యాపిటల్ వాల్యూ ఎక్కువగా నమోదు కావడంతో ఆస్తిపన్ను భారీగా వస్తోంది. గతంలో ఆన్‌లైన్‌లో జరిగిన పొరపాటును గుర్తించాం. దాన్ని సవరించాలని కోరుతూ కౌన్సిల్ ఆమోదంతో సీడీఎంఏకు లేఖ రాశాం.

# అడుగడుగునా ఆనందం.. పక్షులతో మమేకం

జన్నారం : కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలో సాగిన బర్డ్ వాచ్ అడుగడుగునా పక్షిప్రేమికులకు ఆనందాన్నిచ్చింది. అటవీ ప్రాంతంలోనే బసచేసిన పక్షిప్రేమికులు రాత్రి 11 గంటల వరకు చలి మంటలు కాచుకుంటూ కబుర్లతో గడిపారు. ఉదయం 5 గంటలకే ప్రారంభమైన బర్డ్‌వాచర్లకు కనువిందు చేసే పక్షులు తారసపడ్డాయి. బైసన్‌కుంటలో నీటిపై తేలియాడే పక్షులు, నీటిలో నిదానంగా ఈదే బాతులు కెమెరాలకు చిక్కాయి. ఢిల్లీ, హైదరాబాద్, రాజమండ్రి, వరంగల్, మంచిర్యాల, జగిత్యాల పట్టణాలకు చెందిన పక్షి ప్రేమికులు చక్కని అనుభూతిని పొందారు. అతి తక్కువ ఫీజుతో కొత్త కొత్త పక్షులను చూసే అదృష్టాన్ని పొందామని కొందరు హర్షం వ్యక్తం చేశారు. శనివారం గనిశెట్టికుంట, బైసన్‌కుంట వద్ద వేర్వేరుగా బస చేసిన రెండు బృందాల సభ్యులందరిని ఆదివారం ఒక్కచోటికి చేర్చారు. కొందరు వారి అనుభవాలను అధికారులతో పంచుకున్నారు. మరోసారి బర్డ్‌ఫెస్ట్‌ను నిర్వహించాలని మరికొందరు సూచించారు. అనంతరం అధికారులు, పక్షిప్రేమికులు అంతా కలిసి గ్రూపు ఫొటోలు దిగారు. అక్కడి నుంచి మధ్యాహ్నం స్థానిక అటవీశాఖ అతిథి గృహం వద్దకు చేరుకొని మధ్యాహ్న భోజనం అనంతరం ఎవరి గమ్యస్థానాలకు వారు వెళ్లిపోయారు.

ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: పీసీసీఎఫ్

ప్రకృతిని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని అటవీశాఖ ప్రధాన ముఖ్య కన్జర్వేటర్(పీసీసీఎఫ్) శోభ అన్నారు. బర్డ్ వాచ్ ఫెస్ట్ ముగింపు సమావేశానికి హాజరైన ఆమె కవ్వాల్ అటవీ ప్రాంతంలోని బైసన్‌కుంట వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో పక్షిప్రేమికులను ఉద్దేశించి మాట్లాడారు. అందమైన పక్షులకు కవ్వాల్ నిలయంగా మారిందని అన్నారు. బీట్ అధికారి స్థాయి నుంచి జిల్లా అటవీ అధికారి వరకు ప్రతి ఒక్కరి కృషి వల్లనే కవ్వాల్ మంచి స్థాయిలో ఉందని అన్నారు. జన్నారం ఎఫ్‌డీఓ మాధవరావును ప్రత్యేకంగా అభినందించారు. కవ్వాల్ ఫీల్డ్ డైరెక్టర్ వినోద్‌కుమార్, ఆదిలాబాద్ చీఫ్ కన్జర్వేటర్ రామలింగం, మంచిర్యాల డీఎఫ్‌ఓ శివానిడొంగ్రే, ఇంధన్‌పల్లి, తాళ్లపేట రేంజి అధికారులు హఫీసోద్దీన్, రత్నాకర్‌రావు, బీట్, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

## మగ్గంలో.. మహిళల హస్తం

నల్గొండ : కుటుంబ అవసరాలు.. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు తమ అభిప్రాయాలను మార్చుకుంటున్నారు. గతంలో మహిళలు అంటే కేవలం వంటింటికే పరిమితమయ్యేవారు. కానీ తాము దేనికి తీసిపోమని పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తూ సత్తా చాటుతున్నారు. భూదాన్‌పోచంపల్లికి ప్రపంచ వ్యాప్తంగా పట్టుచీరలకు మంచి గుర్తింపు ఉంది. మనసు దోచుకునే అందమైన డిజైన్లను రూపొందించే పనితనం వారి సొంతం. అలాంటి పనుల్లో సైతం తమ ప్రతిభను కనబరుస్తూ చేనేత మగ్గంతో పాటు అనుబంధ రంగాలో పనిచేస్తూ ఉపాధి పొందుతూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నారు. చిటికీలు చుడుతూ, మగ్గం నేస్తూ, రంగులు అద్దుతూ నెలకు రూ.8 వేల వరకు సంపాదిస్తూ కుటుంబానికి భరోసాగా నిలుస్తున్నారు. అలాంటి మహిళల అభిప్రాయాలను వారి మాటల్లోనే..

కుటుంబానికి చేదోడు వాదోడుగా..- సోమేశ్వరి, భూదాన్‌పోచంపల్లి

ప్రస్తుత తరుణంలో కుటుంబంలోని భార్యాభర్త ఇద్దరు కష్టపడితేనే కుటుంబం గడిచే పరిస్థితి. భర్తకు చేదోడు వాదోడుగా ఉండాలని



నేను మగ్గం పనిచేస్తున్నాను. భర్తతో సమానంగా నేనూ చిటికీలు చుడుతూ మగ్గం నేస్తూ ఉపాధి పొందుతున్నాను. మహిళలు ఖాళీగా ఉండకుండా ఏదో ఒక పనిచేస్తే కుటుంబానికి కొంత ఆసరాగా ఉంటుంది.

ఇంటిపనితో పాటు వృత్తితో ఉపాధి..- నరసమ్మ, భూదాన్ పోచంపల్లి

ఇంటి పని పూర్తయిన తరువాత చిటికీలు చుడుతూ, మగ్గం నేస్తూ ఉపాధి పొందుతున్నాను. చేనేత వృత్తిలో కష్టపడటం వల్ల కుటుంబానికి ఎంతో ఆసరాగా ఉంటుందని మగ్గం నేయడం నేర్చుకున్నాను. ప్రస్తుత తరుణంలో కష్టపడితేనే కుటుంబ పోషణ సాధ్యమవుతుంది. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి.

ఖాళీగా ఉండకుండా..- సంతోష, భూదాన్‌పోచంపల్లి

భర్త ప్రయివేట్ ఉద్యోగం చేస్తుంటారు. కుటుంబ పోషణలో తనవంతు బాధ్యతగా చిటికీలు చుట్టడం, రబ్బర్లు విప్పడం వంటి పనులు చేయడంతో పని సులువవుతుంది. కుటుంబ పోషణ కోసం మహిళలు సైతం పనిచేస్తే ఎంతో ఆసరాగా ఉంటుంది. మహిళలు ఖాళీగా ఉండకుండా ఏదో ఒక పనిలో రాణిస్తే బాగుంటుంది.

## మద్దతు అంతంతే..!

నల్గొండ : కేంద్ర ప్రభుత్వ వానాకాలం పంటల మద్దతు ధర పెంపు అంతంత మాత్రంగానే ఉంది. పెరిగిన పెట్టుబడులతో పోల్చితే 2023-24 ఆర్థిక సంవత్సరానికి సేకరించే పంటలకు గిట్టుబాటు ధర ఆశాజనకంగా లేకపోవడంతో అన్నదాతలు దిగులు చెందుతున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో అత్యధికంగా సాగయ్యే వరికి ఏ గ్రేడ్ రకానికి రూ.2203 ఇచ్చేలా ఎఫ్‌సీఐని ఆదేశించింది. పత్తి ఏ గ్రేడ్‌కు రూ.7020, బీ గ్రేడ్‌కు రూ.6620కి కొనాలని నిర్ణయించింది. ఈ ధరలు మాత్రం లాభదాయకంగా లేవని కర్షకులు వాపోతున్నారు.

బహిరంగ మార్కెట్‌లో అధిక ధర

కేంద్రం ప్రకటించిన మద్దతు ధరల కంటే బహిరంగ మార్కెట్‌లోనే పంటలకు గిట్టుబాటు ధర లభిస్తోంది. ఈ ఏడాది ఆరుతడి పంటల సాగు గణనీయంగా తగ్గింది. ఉత్పత్తి సగానికి సగం పడిపోయింది. దీంతో విపణిలో పంటలకు మంచి డిమాండ్ ఉంటుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. చీడపీడలు, ప్రకృతి వైపరీత్యాలతో పంటల దిగుబడి పడిపోతున్న తరుణంలో కేంద్రం మద్దతు ధరలు పెంచినా రైతులకు ప్రయోజనం చేకూర్చదని రైతు సంఘాలు నాయకులు ఆరోపిస్తున్నారు. మొక్కజొన్న రెండేళ్లుగా మార్కెట్‌లో క్వింటాకు రూ.2200 కొనుగోలు చేస్తుంటే కేంద్రం ఇప్పుడు రూ.2,090 మాత్రమే ఇవ్వడంపై సాగుదారులు పెదవి విరుస్తున్నారు. మిగతా పంటలది దాదాపు అదే పరిస్థితి.

స్వల్పంగా పెరిగినా..యాదాద్రి భువనగిరి జిల్లాలో 3.04 లక్షలు, నల్గొండ 5.03 లక్షలు, సూర్యాపేటలో 4.30 లక్షల ఎకరాల్లో ప్రస్తుత వానాకాలంలో వరి పంట సాగు చేస్తున్నారు. ప్రతి సీజన్‌లో సుమారుగా 33 లక్షల క్వింటాళ్ల దిగుబడులు వస్తున్నాయి. 2020-21లో క్వింటా ధర రూ.1960 ఉండగా 2021-2022లో రూ.2,080కు పెంచారు. ఇప్పుడు రూ.2,203 ఖరారు చేశారు. అంటే పెరిగిన రూ.123 ధరతో సీజన్‌కు జిల్లా రైతుకు సుమారుగా రూ.4,059 కోట్ల అదనపు ఆదాయం వచ్చే వీలుంది. పెరిగిన పెట్టుబడుల నేపథ్యంలో క్వింటాకు కనీసం రూ.2500 పైచిలుకు ఉంటేనే ప్రయోజనం ఉంటుందని అన్నదాతలు చెబుతున్నారు.

## సీఎంఆర్ బియ్యం సేకరణ గడువు పెంపు

సూర్యాపేట : నెలల తరబడి వానాకాలం సీఎంఆర్ బియ్యం పెట్టకుండా మీనమేషాలు లెక్కిస్తున్న మిల్లర్లకు కేంద్రం మరో గడువు ఇచ్చింది. నవంబరు 30 వరకు బకాయి సీఎంఆర్ బియ్యం పూర్తిస్థాయిలో పెట్టాలని సూచించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వానాకాలం సీఎంఆర్ లక్ష్యం 7,00,761 మెట్రిక్ టన్నులు ఉండగా.. ఇప్పటి వరకు 4,07,564 మెట్రిక్ టన్నులు పెట్టారు. ఇంకా 2,93,197 మెట్రిక్ టన్నులు పెట్టాల్సి ఉంది. ఈ బకాయి వసూలు చేసేందుకు రెండు నెలల గడువు పెంచింది. ఇప్పటికే పలుమార్లు గడువు పెంచినందున ఈసారి గడువు లోగా ఉన్న బకాయి లక్ష్యం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎఫ్‌సీఐ పౌరసరఫరాల శాఖకు సూచించింది. మిల్లుల వారీగా సమీక్షించుకుంటూ బకాయిలు వసూలు చేయాలని ఎఫ్‌సీఐ అధికారులు కూడా సీఎంఆర్ వసూలు కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని సూచించింది.

నేడు సూర్యాపేట జిల్లా మిల్లర్ల సమావేశం

సీఎంఆర్ బియ్యం పెట్టడంలో ఉమ్మడి జిల్లాలో సూర్యాపేట జిల్లా బాగా వెనకబడి ఉంది. కేవలం 37 శాతం మాత్రమే పూర్తయింది. వానాకాలం బకాయి ఇలా ఉండగానే యాసంగి ధాన్యం కూడా మిల్లులకు కేటాయించారు. యాసంగి సీఎంఆర్ నామమాత్రంగానే పెట్టారు. అధికారులు వానాకాలం సీఎంఆర్ లక్ష్యం పూర్తి చేసేందుకు మిల్లర్లపై కేవలం దాని కోసమే ఒత్తిడి తెస్తున్నారు. దీంతో యాసంగి కూడా పెండింగ్ పడుతోంది. వానాకాలం సీఎంఆర్ బియ్యం పెట్టాల్సిన బకాయి మిల్లర్ల సమావేశం ఏర్పాటు చేసేందుకు జిల్లా యంత్రాంగం ఉపక్రమించింది. ఈనెల 30న బకాయి మిల్లర్ల సమావేశం జిల్లా కేంద్రంలో జరగనుంది. బకాయిల వసూలు ప్రధాన ఎజెండాగా సమావేశం నిర్వహిస్తారు. సమావేశంలో బకాయిల వసూలుపై ప్రధానంగా దృష్టి సారించే అవకాశం ఉంది.

# గృహ ప్రవేశానికి వేళాయె..



జగిత్యాల : సొంతింటి కల ప్రతి ఒక్కరి జీవిత లక్ష్యం.. అలాంటి వారి కలను నిజం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం చేపట్టింది. జగిత్యాల పట్టణానికి సమీపంలో నూకపల్లి శివారులో హైదరాబాద్ తర్వాత అత్యధికంగా 4520 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. అప్పటి ఎంపీ ప్రస్తుత ఎమ్మెల్సీ కవిత చొరవతో మున్సిపల్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ 2018 ఏప్రిల్ 24న శంకుస్థాపన చేశారు. దాదాపు రూ.283 కోట్లతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా ప్రస్తుతం పనులు పూర్తి కాగా రహదారులు, విద్యుత్తు, తాగునీటి పనులు ఇంకా కొనసాగుతున్నాయి. 560 ఇళ్లకు మాత్రం విద్యుత్తు, రహదారులు, తాగునీటి ఏర్పాటు పూర్తయ్యాయి. మిగతా వాటికి ఇంకా పనులు కొనసాగుతున్నాయి. అక్టోబరు 3న మంత్రి కేటీఆర్ జగిత్యాల పర్యటనలో భాగంగా 3722 మంది లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేయనున్నారు. ఇళ్ల పంపిణీతోపాటు జిల్లా పోలీసు కార్యాలయం, సమీకృత మార్కెట్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారు. అభివృద్ధి పనులను ప్రారంభించనున్న నేపథ్యంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జిల్లా కలెక్టర్ యాస్మిన్‌బాషా, పంచాయతీరాజ్ ఇతరశాఖల అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇళ్ల నిర్మాణం కోసం అయిదేళ్లుగా లబ్ధిదారులు ఎదురు చూస్తుండగా ఎట్టకేలకు నిర్మాణాలు పూర్తయి సొంతింటి కల నిజం కానుండటంతో ఆనందం వ్యక్తమవుతోంది. ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక జరగగా ఏ ఇళ్లు కేటాయించాలన్నది మాత్రం ఆన్‌లైన్ డ్రా ద్వారా ఎంపిక చేసి నంబరు కేటాయిస్తారు. నంబరు ఆధారంగా లబ్ధిదారులు ఇంటి గృహ ప్రవేశం చేసుకోవచ్చు.

మౌలిక వసతులు కల్పించాలి..దాదాపు అయిదు వేల కుటుంబాలు, ఇంటికి నలుగురి చొప్పున దాదాపు 15 నుంచి 20 వేల మంది కాలనీలో జీవించే అవకాశం ఉంది. వీరంతా నిరుపేదలు కాబట్టి మౌలిక వసతులు తక్షణం కల్పించాల్సిన అవసరం ఉంది. ఇక్కడ నివసించే వారు ఉపాధి నిమిత్తం నిత్యం జగిత్యాల పట్టణానికి రావాల్సి ఉంటుంది. తక్షణం బస్సు, ఇతర రవాణా సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది. మల్యాల వెళ్లే బస్సులు నూకపల్లి అర్బన్ కాలనీ మీదుగా నడిపించాలని కోరుతున్నారు. దీంతో పాటు వైద్యశాల, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, పిల్లలు ఆడుకునేందుకు ఆటస్థలం, పోలీస్‌స్టేషన్, రహదారులు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. కాలనీకి సమీపంలో న్యాక్ కేంద్రం ఉండడంతో ఎలక్ట్రీషియన్, కుట్టుమిషన్, ఇతర వృత్తి నైపుణ్య శిక్షణను అవకాశం కల్పించాల్సి ఉంటుంది.

నా అదృష్టంగా భావిస్తున్నా..- డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే, జగిత్యాల

ఎమ్మెల్సీ కవిత చొరవతో సీఎం కేసీఆర్ హైదరాబాద్ తర్వాత జగిత్యాలకు పెద్ద మొత్తంలో ఇళ్లను మంజూరు చేయటం, కాస్త ఆలస్యమైనా 4520 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయటం నా అదృష్టంగా భావిస్తున్నాను. ప్రస్తుతం 3722 ఇళ్లను పంపిణీ చేస్తాం. మిగతావి ఇంకా ఇళ్లు లేని వారిని గుర్తించి ఇస్తాం. పారదర్శకంగా ఎంపిక జరిగింది. ఇళ్ల కేటాయింపు కూడా ఆన్‌లైన్ డ్రా ద్వారానే ఇస్తారు. పోలీస్‌స్టేషన్, బస్సు సౌకర్యం, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల, వైద్యశాల, ఆటస్థలం మిగిలిన పనులు రెండు నెలల్లో పూర్తి చేస్తాం.

# పడకేసిన పారిశుద్ధ్యం.. జ్వరాల బారిన జనం



ఎల్లారెడ్డిపేట : పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ప్రజలు వ్యాధుల బారినపడుతున్నా పట్టించుకునే నాథుడు కరవయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి మంగళవారం పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలు, ప్రతి శుక్రవారం తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్ నిర్వహించాలనే ఉన్నతాధికారుల ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలుకావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఒకటిరెండు మినహా మిగతా గ్రామాల్లో ఫాగింగ్ చేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. పారిశుద్ధ్య లోపం వల్ల దోమలు విజృంభించి అనేక మంది జ్వరాల బారిన పడుతున్నారు. చికిత్స కోసం రూ.వేలు ఖర్చు చేస్తున్నారు. గిరిజన తండాల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. మురుగునీటి కాలువల నిర్వహణ, తాగునీటి క్లోరినేషన్‌లపై ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎల్లారెడ్డిపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో గడిచిన వారం రోజుల వ్యవధిలోనే 175 జ్వర కేసులు నమోదవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

మురుగు కాలువల నిర్వహణ అధ్వానం

గ్రామాల్లో ప్రతి మంగళవారం పారిశుద్ధ్య పనులు, ప్రతి శుక్రవారం క్లోరినేషన్ చేయాలనే అధికారుల సూచనలు ఎక్కడా అమలు కావడం లేదు. మురుగునీటి కాలువల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అనేకం శిథిలమై మరమ్మతులకు నోచుకోవడం లేదు. పూడికతో నిండిపోవడం వల్ల మురుగు రహదారులపైకి వచ్చి చేరుతోంది. నీటి నిల్వ ప్రదేశాల్లో దోమల లార్వాలు వృద్ధిచెందకుండా ఉండేందుకు బ్లీచింగ్ పౌడర్‌ను చల్లడం లేదు. అయిల్‌బాల్స్, ఇతర రసాయన మందులను పిచికారీ చేయడం లేదు. క్లోరినేషన్ పనులు చేయించడంలో పంచాయతీ పాలకవర్గాలు నిర్లక్ష్యం చూపుతున్నాయనే ఆరోపణలు మిన్నంటుతున్నాయి. ఎక్కడపడితే అక్కడ నీటి నిల్వలు పేరుకుపోతుండటంతో దోమలు వృద్ధిచెందుతున్నాయి. అక్కడక్కడా పైపులైన్ల లీకేజీల వల్ల కలుషిత నీరు సరఫరా అవుతోంది. దీని వల్ల ప్రజలు మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాల బారిన పడుతున్నారు. ఇళ్లమధ్య చెత్తాచెదారం నిల్వ ఉంటుండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. జనావాసాల మధ్య పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. మురుగునీరు ఉన్న ప్రాంతంలో బ్లీచింగ్‌పౌడర్ చల్లడం లేదు.

ఆసుపత్రులు కిటకిట


ఈ వానాకాలం సీజన్‌లో అనేక మంది ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా జలుబు, దగ్గు, జ్వరాలతో బాధపడుతున్నారు. దగ్గు ఎంతకీ తగ్గకపోవడం, జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. ఎల్లారెడ్డిపేట సామాజిక ఆరోగ్యకేంద్రంతోపాటు పలు ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. పల్లెప్రాంత వాసులు స్థానికంగా ఉండే పీఎంపీ, ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. వైద్యం కోసం రూ.వేలు వెచ్చిస్తున్నారు. పారిశుద్ధ్య లోపానికి వాతావరణ మార్పులు తోడవుతుండటంతో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఉదయం, పగటి వేళల్లో ఎండ తీవ్రంగా ఉంటూ సాయంత్రం వేళల్లో జల్లులు పడుతున్నాయి. గాలిలో తేమశాతం పెరగడంతో ఊపిరితిత్తుల సమస్యలు పెరుగుతున్నాయి. పిల్లలు, వృద్ధులతోపాటు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు సతమతం అవుతున్నారు. ఎల్లారెడ్డిపేట సామాజిక ఆరోగ్యకేంద్రంలో రోజుకు సగటున 20 జ్వర కేసులు నమోదవుతున్నాయి.

జాగ్రత్తలు పాటించాలి

ప్రస్తుత సీజన్‌లో ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి. ఒకరి నుంచి ఇతరులకు జ్వరాలు ప్రబలకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. ఇళ్లలో దోమ తెరలు వాడాలి. జ్వరం వస్తే వెంటనే స్థానిక ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలి. రోగికి అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి, చికిత్స అందిస్తాం. చాలా వరకు జ్వరాలు మూడు నుంచి ఐదు రోజుల్లో తగ్గిపోతున్నాయి. చల్లటి నీరు, ఆహార పదార్థాలను తీసుకోవద్దు. వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల పరిధిలో ఏఎన్‌ఎంలు జ్వర సర్వే నిర్వహిస్తున్నారు. బాబు, సీహెచ్‌సీ సూపరింటెండెంట్, ఎల్లారెడ్డిపేట

# వసతుల లోపం.. పరిసరాలు అధ్వానం

పెద్దపల్లి : స్వచ్ఛతలో పోటీ పడుతున్న పెద్దపల్లి పురపాలక సంఘం పరిధిలో మౌలిక వసతుల సమస్య వెంటాడుతోంది. ఇళ్ల మధ్య మురుగు గుంతలు, కాలువల నిర్వహణలో నిర్లక్ష్యం.. వెరసి జిల్లా కేంద్రం అపరిశుభ్రతకు నిలయంగా మారింది. ఇన్నాళ్లు శివారు కాలనీలకే పరిమితమైన పారిశుద్ధ్య లోపం ప్రస్తుతం అంతర్గత వీధుల్లోనూ కనిపిస్తోంది. ఒకటి, రెండు కాలనీలు మినహా ప్రతి వీధిలో మౌలిక వసతుల లోపం నెలకొంది. పారిశుద్ధ్యంతో పాటు తాగునీటి సరఫరా కూడా అస్తవ్యస్తంగా మారింది. పలు ప్రాంతాల్లో మిషన్ భగీరథ పైపులు నిర్మించినా ప్రారంభించకుండానే పని చేయకుండా పోయాయి. మరికొన్ని ప్రాంతాల్లో కోతుల బెడదతో స్థానికులకు కునుకు కరవైంది. విలీన గ్రామాల్లో.. పెద్దపల్లి పురపాలక సంఘంలో విలీనమైన గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ మరింత దిగజారింది. ఆయా గ్రామాల్లో కౌన్సిలర్లు ప్రత్యేక దృష్టి సారిస్తే తప్ప సమస్యలు పరిష్కారం కావడం లేదు. రంగంపల్లి పరిధిలోని చీకురాయి రోడ్డు సమీపంలోని కాలనీలు, బంధంపల్లి, గొల్లపల్లి, చందపల్లి, పెద్దమ్మనగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. పాత మునిసిపల్ పరిధిలోని శాంతినగర్, సాగర్‌రోడ్డు, తెనుగువాడ, ముదామీస్ట్రీట్ ప్రాంతాల్లో కాలువల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మురుగుకాలువల నిర్వహణలో నిర్లక్ష్యంపై మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్‌ను వివరణ కోరగా ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో నీరు నిల్వకుండా యజమానులకు



నోటీసులు ఇచ్చామన్నారు. కాలువల నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆసుపత్రికి బాధితుల తాకిడి జిల్లాకేంద్రంలో మురుగుకాలువల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. చెత్త తొలగింపు ప్రక్రియ నిర్ణీత వ్యవధి ప్రకారం కాకుండా గుర్తుకొచ్చినపుడో, స్థానికులు ఒత్తిడి తెచ్చినపుడో తొలగించే పరిస్థితి నెలకొంది. కొన్ని వీధుల్లో కౌన్సిలర్లు క్రమం తప్పకుండా స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో పారిశుద్ధ్యం ఫరవాలేదన్నట్లుగా ఉంది. మిగిలిన ప్రాంతాల్లో మురుగు నిర్వహణ సరిగ్గా లేక దోమల ఉద్ధృతి పెరిగి స్థానికులు జ్వరాల బారిన పడుతున్నారు. పెద్దపల్లి పట్టణంలో పెరిగిన జ్వరాల తీవ్రతతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. జిల్లా ఆస్పత్రికి వచ్చే జ్వర పీడితుల సంఖ్య గత వారం రోజుల్లో 100 నుంచి 150కి పెరిగింది. ప్రైవేటు దవాఖానాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

## సర్కారు వైపు.. అడుగు పడలేదెందుకో..!

సూర్యాపేట : జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు ఏటా క్రమంగా తగ్గుతున్నాయి. ప్రవేశాలపై ఇంటర్ బోర్డు ప్రత్యేక దృష్టిసారించినా ఆశించిన మేర ఫలితాలు కనిపించడం లేదు. ప్రైవేటు కళాశాలల తరహాలో ప్రచారం చేస్తున్నా ఆ స్థాయిలో చేరికలు లేవు. జూన్ 1 నుంచి విద్యా సంవత్సరం ప్రారంభంకాగా.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రవేశాలు అంతంత మాత్రంగానే ఉండటంతో ఆగస్టు 31 వరకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయినా ఆశించిన స్థాయిలో లేకపోవడంతో మరోమారు సెప్టెంబరు 16 వరకు పొడిగించినా అదే పరిస్థితి నెలకొంది. వచ్చే ఏడాదయినా మెరుగైన ఫలితాలు రాబట్టేలా అధ్యాపకులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని విద్యాశాఖ యోచిస్తోంది.

గురుకులాల ప్రభావం

జిల్లా వ్యాప్తంగా ఏడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. జనరల్, ఒకేషనల్ కోర్సులో విద్యాబోధన అందిస్తున్నారు. ఒక్కో గ్రూపులో 40 మంది వరకు అవకాశం ఇస్తున్నారు. గత ఏడాది 2300 మంది ప్రవేశాలు పొందగా.. ప్రస్తుతం మొదటి సంవత్సరంలో రెండు వేల మంది విద్యార్థులు ప్రవేశాలు తీసుకున్నారు. ఇందులో



1,408 జనరల్ కోర్సులు, 689 మంది ఒకేషనల్ కోర్సుల్లో చేరారు. ఇప్పటి వరకు ఏ కళాశాలలోనూ పూర్తి స్థాయిలో సీట్లు నిండకపోవడం గమనార్హం. కళాశాలల్లో వసతులతోపాటు బోధన గతంలో కన్నా మెరుగుపడినా విద్యార్థుల్లో ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వ అనుబంధ కళాశాలలు (గురుకులాలు, కేజీబీవీలు) పెరగడంతో ప్రవేశాలపై ప్రభావం చూపుతున్నాయని అధ్యాపకులు చెబుతున్నారు. ప్రభుత్వ కళాశాలలకు వచ్చే విద్యార్థుల్లో గ్రామీణ వాసులే ఎక్కువ మంది ఉంటున్నారు. వీరికి గతంలో మధ్యాహ్న భోజనం అమలు చేస్తామని ప్రకటించినా ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు మధ్యాహ్న సమయంలో ఆకలికి తట్టుకోలేక గైర్హాజరవుతున్నట్లు తెలుస్తోంది.

కళాశాలలకు చాలని నిధులు

కళాశాలల నిర్వహణలో భాగంగా ఒక్కో విద్యార్థికి రూ.71 చొప్పున కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లా వ్యాప్తంగా రూ.1,63,300 నిధులు మంజూరు చేసింది. వీటిని సుద్దముక్కలు, డస్టర్లు, రిజిస్టర్లు, తాగునీరు, మరమ్మతులు, విద్యుత్తు తదితరాలకు ఖర్చు చేయనున్నారు. తక్కువ నిధులు కేటాయించడంతో ప్రిన్సిపాళ్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కళాశాల నిర్వహణకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులు సరిపోవడం లేదని, ఒక్కో విద్యార్థికి రూ.300 చొప్పున పెంచాలని కోరుతున్నారు.

ప్రత్యేక దృష్టి సారించాం

-కృష్ణయ్య, డీఐఈవో, సూర్యాపేట

మొదటి సంవత్సరంలో ప్రవేశాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాం. గత సంవత్సరం కంటే ఈసారి ప్రవేశాలు తగ్గినా రాష్ట్ర వ్యాప్తంగా పోల్చితే జిల్లా మెరుగ్గానే ఉంది. ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు ఇప్పటి నుంచి ప్రయత్నాలు మొదలుపెట్టాం. వచ్చే ఏడాది ఫలితాల ఆధారంగానే ప్రవేశాలు పెంచేందుకు ప్రణాళిక రూపొందించాం.

## పొదుపుతోనే.. బిల్లు అదుపు

సూర్యాపేట : సూర్యాపేటకు చెందిన శ్రీనివాస్ తన ఇంట్లో టీవీ, ఫ్రిజ్, ఏసీ, బోరుమోటారు వినియోగిస్తున్నారు. ప్రతి నెలా 220 నుంచి 230 యూనిట్ల విద్యుత్తు వాడుతున్నారు. దీనికి స్లాబ్ రేట్ ప్రకారం యూనిట్ రూ.5.10గా లెక్కిస్తారు. 200 లోపు యూనిట్లు వాడితే రూ.3.40గా లెక్కిస్తారు. అంటే 20 నుంచి 30 యూనిట్లు పొదుపు చేస్తే బిల్లు తగ్గించుకోవచ్చు. రూ.1200 నుంచి 1250 వచ్చే బిల్లు 200 యూనిట్ల లోపు వాడితే రూ.900 లోపు వచ్చే అవకాశం ఉంది. రోజురోజుకూ నివాస గృహాల్లో విద్యుత్తు వినియోగం పెరుగుతోంది. సరైన అవగాహన లేకపోవడంతో ఇష్టారీతిన యూనిట్లను వాడుతున్నారు. బిల్లు వచ్చిన తర్వాత ఇంత వచ్చిందా అని గుబులు చెందుతున్నారు. ఇంట్లో టీవీ ఆన్‌చేసి పనులు చేసుకోవడం.. ఫ్యాన్..లైట్ వేసి మరిచిపోయి పట్టించుకోరు. బెడ్‌రూంలో ఏసీ ఆన్‌లోనే ఉంటుంది. ఇలాంటి చిన్నపాటి నిర్లక్ష్యం బిల్లు పెరుగుదలకు కారణమవుతుందనే విషయాన్ని వినియోగదారులు మరిచిపోతున్నారు. ఒక యూనిట్ దాటినా బిల్లు వందల్లో వస్తుంది. విద్యుత్తు పొదుపుగా వాడుకుంటే రూ.200 నుంచి రూ.300 లోపే వచ్చే అవకాశం ఉంటుంది.

ఇలా లెక్కలు ఇంట్లో భార్యాభర్త ఇద్దరే ఉంటే ఒక ఫ్యాన్, రెండు లైట్లు, టీవీ వినియోగిస్తూ 50 యూనిట్లలోపు వాడుకుంటే యూనిట్ ధర రూ.1.95 చొప్పున రూ.100 వరకు బిల్లు వచ్చే అవకాశం ఉంది. ఇందులో అదనపు ఛార్జీలు కొద్దిమొత్తంలో కలుస్తాయి.

100 యూనిట్లకు రూ.3.10 కాగా.. 100 యూనిట్లు దాటితే రూ.3.40కి లెక్కిస్తారు. యూనిట్లకు మొత్తం అంటే 0 నుంచి 100కు పైన యూనిట్లకు మొత్తం రూ.3.40 గానే లెక్కిస్తారు. మధ్య తరగతి కుటుంబం 190 యూనిట్లు వాడితే రూ.640 బిల్లు వచ్చే అవకాశం ఉంది. ఇందులో అదనపు ఛార్జీలు అదనంగా కలుస్తాయి.

101 యూనిట్ల నుంచి 200 యూనిట్ల వరకు 0 నుంచి 200 వరకు ఒకే స్లాబ్‌లో రూ.4.80గా లెక్కిస్తారు. అదే 200 యూనిట్లు దాటి ఒక యూనిట్ పెరిగినా రూ.5.10న లెక్కిస్తారు.

201 నుంచి 300 వరకు రూ.7.70, 301 నుంచి 400 వరకు రూ.9.00గా లెక్కిస్తారు. 401 నుంచి 800 వరకు రూ.9.50గా లెక్కిస్తారు. 800 పైగా ఎన్ని యూనిట్లు కాలినా రూ.10గా లెక్కిస్తారు.

ఇవి పాటిస్తే మేలు

ఐఎస్ఐ కంపెనీ ఫ్యాన్లు, కూలర్లు, బోరుమోటారు, గ్రైండర్ వినియోగించాలి.

అవసరం మేరకే టీవీ, ఫ్యాన్లు, లైట్లు వాడాలి.

ఎల్ఈడీ బల్బులే వాడాలి. అది కూడా 10 వాట్స్‌లోపు ఉంటే మేలు.

ఏసీ 20 డిగ్రీల ఉష్ణోగ్రతలో వాడుకుంటే బిల్లు తక్కువ వచ్చే అవకాశం ఉంది. అది కూడా 3 స్టార్, 5 స్టార్ ఉన్న ఏసీలు, ఫ్రిజ్‌లు కొనుగోలు చేయాలి.

# ఆలస్యమైనా.. ఉత్పత్తి చేపట్టడమే లక్ష్యంగా..

కొత్తగూడెం : ప్రస్తుత ఉత్పత్తి సంవత్సరాదిలోనే సింగరేణి ప్రారంభించాలనుకున్న కొత్త ప్రాజెక్టులు ఆలస్యమయ్యాయి. డిసెంబరు నుంచైనా ఉత్పత్తి చేపట్టాలనే లక్ష్యంతో యాజమాన్యం చర్యలు వేగిరం చేసింది. ఈ విషయాన్ని పంద్రాగస్టు వేడుకల్లోనూ డైరెక్టర్ బలరాం ప్రస్తావించారు. సంస్థ పరిధిలో ఈ ఏడాది మొత్తం నాలుగు కొత్త ప్రాజెక్టులు ప్రారంభమవ్వాల్సి ఉంది. అవన్నీ ఉపరితల గనులే కాగా.. రెండుచోట్ల మాత్రం కాస్త ఆలస్యంగానైనా ఉత్పత్తి దిశగా పనులు కొనసాగుతున్నాయి. ఆ రెండు గనులూ భద్రాద్రి జిల్లా పరిధిలోనివే కావడం విశేషం.ఆ నాలుగు ఇవే.. కొత్తగూడెం ఏరియాలోని వీకే 7, ఇల్లెందు ఏరియా రొంపేడు, బెల్లంపల్లి ఏరియా గోలేటి, ఒడిశాలోని నైనీ కోల్‌బ్లాకులు ఈ ఏడాది ప్రారంభించే ఉద్దేశంతో సింగరేణి వార్షిక లక్ష్యాలు సైతం విధించింది. ఒడిశా గనికి అనుమతులు రాగా ఉత్పత్తి దిశగా పనులు ముమ్మరమయ్యాయి. కొత్తగూడెంలోని జీకే ఓసీ విస్తరణలో భాగంగా ఏర్పాటు కానున్న భారీ గని వీకే ఓసీలో ఉత్పత్తి గతేడాది ప్రారంభమవుతుందని భావించగా.. ప్రత్యామ్నాయ భూమిని



అటవీశాఖకు అప్పగించడంలో ఆలస్యం జరిగిన విషయం తెలిసిందే. ఈ సమస్య పరిష్కారానికి యాజమాన్యం చర్యలు చేపట్టింది. రొంపేడు, గోలేటి ఓసీలకూ అటవీ అనుమతులే లభించాల్సి ఉంది. అంతా సజావుగా జరిగితే ఈ సంవత్సరాంతానికి అన్నిచోట్ల ఉత్పత్తి ప్రారంభమవుతందని అధికారులు భావిస్తున్నారు.అనివార్యంగా కుదింపు.. ఈ ఏడాది వీకే ఓసీకి 43 లక్షలు, రొంపేడులో 20 లక్షలు, గోలేటిలో 35 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని వార్షిక లక్ష్యంగా యాజమాన్యం నిర్దేశించింది. అటవీ అనుమతుల్లో జాప్యంతో తాజాగా లక్ష్యాలను సవరించింది. మొత్తమ్మీద డిసెంబరు నుంచి మార్చి నెలాఖరు లోగా 10 నుంచి 15 లక్షల టన్నులైనా ఉత్పత్తి సాధించాలని అధికారులను ఆదేశించారు. ఇందులో వీకే ఓసీ 7 లక్షలు, రొంపేడులో 3, గోలేటిలో 5 లక్షల వరకు ఉత్పత్తి చేపట్టాలనే యోచనలో ఉన్నారు.

# ఆదివాసీ మహిళల ఆర్థిక స్వావలంబన..!

ఏటూరునాగారం : స్వశక్తితో తాము నిర్వహిస్తున్న పరిశ్రమను విస్తరించి మరికొంత మందికి ఉపాధి కల్పిస్తామని చెబుతున్నారు ఏటూరునాగారం మండల కేంద్రంలో డ్రైమిక్స్ పరిశ్రమ నిర్వహిస్తున్న మహిళలు. మహిళల పొదుపు సంఘంలో సభ్యులుగా చేరిన తమను గ్రామైక్య సంఘం నుంచి జాయింట్ లయబిలిటీ గ్రూపు సభ్యులుగా ఎంపిక చేసి ఐటీడీఏ ఈ అవకాశాన్ని కల్పించిందని, మరో వంద మందికైనా తమ పరిశ్రమలో ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో పని చేస్తున్నామంటున్నారు.

డిసెంబర్ 2020లో ప్రారంభం

ఏటూరునాగారంలోని పీఎమ్మార్సీ ప్రాంగణంలో ఐటీడీఏ స్వయంకృషి ఆదివాసీ మహిళా జేఎల్‌జీని ఏర్పాటు చేసి పది మంది మహిళలకు సభ్యత్వం కల్పించి డ్రైమిక్స్ యూనిట్ పేరుతో పోషకాహారాన్ని తయారు చేసే పరిశ్రమను ఏర్పాటు చేశారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పథకంలో భాగంగా రూ.40 లక్షలు ఖర్చు చేశారు. ఈ పెట్టుబడిలో 60 శాతం ట్రైకార్ రాయితీ, 30 శాతం బ్యాంకులు, 10 శాతం మొత్తాన్ని లబ్ధిదారుల వాటా కింద చెల్లించి 29 డిసెంబర్ 2020న పరిశ్రమను ప్రారంభించారు.

సభ్యులకు ఇక్రిశాట్‌లో శిక్షణ..సంస్థను ప్రారంభించడానికి ముందు సభ్యులు ఐటీడీఏ అధికారుల సాయంతో హైదరాబాద్‌లోని ఇక్రిశాట్ సంస్థలో రెండు నెలల శిక్షణ తీసుకున్నారు. ఇక్రిశాట్ నుంచి ఒక సమన్వయకర్త వచ్చి ఏడాదిపాటు పరిశ్రమలోనే ఉంటూ సభ్యులకు పూర్తిగా అవగాహన కల్పించి అన్నిరకాలుగా అండగా నిలిచారు. గిరిజన ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అందించిన 60 శాతం రాయితీ మొత్తాన్ని సభ్యులకు అందించకుండా యంత్రాల రూపంలో ఇక్రిశాట్ సంస్థ కొనుగోలు చేసి ఇచ్చింది. బ్యాంకు వాటా కింద ఇవ్వాల్సిన రుణాన్ని స్థానికంగా ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంకు ఇచ్చేందుకు అంగీకరించలేదు. కేవలం ట్రైకార్ అందించిన సబ్సిడీ, లబ్ధిదారుల వాటా ధనం కింద పెట్టుబడిగా పెట్టిన రూ.4 లక్షలను మూలధనంగా వెచ్చించి పరిశ్రమను స్థాపించారు.

ఉత్పత్తులు ఇవీ..జోవార్ మీల్, మల్టీగ్రేయిన్, మల్టీగ్రేయిన్ స్వీట్ మూడు రకాల ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారు. జోవార్‌మీల్(జొన్నలు, శనగ పప్పు, వేరుశనగలు, జీలకర్ర, ఎర్రమిర్చి, ఆవాలు, కరివేపాకు, ఉప్పు), మల్టీగ్రేయిన్ మీల్(జొన్నలు, కొర్రలు, పెసరపప్పు, జీలకర్ర, ఉప్పు, మిరియాలు, ఎర్రమిరప కారం, దనియాలు, చక్కర), మల్టీగ్రేయిన్ స్వీట్ మీల్ (జొన్న విత్తనాలు, గోదుమ విత్తనాలు, బెల్లం, చక్కర, బాదం పప్పు, ఎండు ద్రాక్ష, కూరగాయల కొవ్వు, యాలకులు, పచ్చిపసుపు, తదితరాలతో మల్టీగ్రేయిన్ స్వీట్ మీల్‌ను తయారు చేస్తున్నారు. ఈ ఉత్పత్తులను జీసీసీ ద్వారా గిరిజన సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, కళాశాలలకు విక్రయిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు.

సామర్థ్యాన్ని పెంచాలనుకుంటున్నాం..

యశోద, సంస్థ అధ్యక్షురాలు

ప్రస్తుత ఉత్పత్తిస్థాయిని పెంచాలని నిర్ణయించుకున్నాం. అధికారుల సాకారంతో ముందుకెళ్తున్నాం. బ్యాంకర్లు రుణం ఇచ్చేందుకు ముందుకు రాకపోతే అప్పటి జిల్లా కలెక్టర్ ఎస్.కృష్ణఆదిత్య ప్రత్యేక చొరవతో జిల్లాలోని డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.25 లక్షలు అందించారు. ఆదివాసీ గిరిజన మహిళలమైనందున హైదరాబాద్ ఈసీఐఎల్ కంపెనీ కూడా రూ.10 లక్షల ఆర్థిక సాయం చేసింది. అందరి సాకారంతో ముందుకు వెళ్తున్నాం.

బయట మార్కెట్‌కు కూడా వెళ్తాం..శ్రీదేవి, సంఘం సహాయ కార్యదర్శి

ప్రస్తుతం గిరిజన సంక్షేమ శాఖలోని పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలకు మాత్రమే విక్రయిస్తున్నాం. బయటి మార్కెట్‌లో కూడా విక్రయిస్తే టర్నోవర్ పెరుగుతుంది. ఆ దిశగా సభ్యులమంతా చర్చించి ముందుకు సాగుతాం.

# గిరిజనుల చెంతకు వైద్యసేవలు



భద్రాచలం : భద్రాచలం మన్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధమైంది. ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో శిరీష సారథ్యంలో వీటిని నిర్వహించేందుకు చర్యలు మొదలయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎంపిక చేసిన 47 చోట్ల మెడికల్ క్యాంపులను కొనసాగించనున్నారు. ఏజెన్సీలో ఎక్కడెక్కడ వీటి అవసరం ఉందో గుర్తించి సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సమాచారం ఇచ్చారు. నెలకు 4 నుంచి 9 శిబిరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అక్టోబరు 3న పినపాక పీహెచ్‌సీ పరిధిలోని బయ్యారం కూడలిలో దీన్ని ప్రారంభించనున్నారు. అక్టోబరులో 9, నవంబరులో 8, డిసెంబరులో 9, 2024 జనవరిలో 9, ఫిబ్రవరిలో 8, మార్చిలో 4 క్యాంపులు అందుబాటులోకి వస్తాయి. ప్రతి శిబిరానికి మూడు రోజుల నుంచి వారం విరామం ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందుకోసం పల్లెల్లో మైక్ ద్వారా ప్రచారం చేయాలని భావిస్తున్నారు. వైద్యం కోసం వచ్చేవారికి నీడను కల్పించేందుకు టెంట్లు, తాగునీటిని సమకూర్చనున్నారు.

నిపుణుల జాబితా రూపకల్పనలో..

ప్రత్యేక వైద్య శిబిరాల జాబితా తయారైనప్పటికీ ఇంకా వైద్య నిపుణుల జాబితా తయారు కాలేదు. వీటిని నిర్వహించేది వైద్య ఆరోగ్య శాఖ. ఇందులో ఎక్కువగా ఎంబీబీఎస్ వైద్యులు సేవలందిస్తున్నారు. క్యాంపులకు కావాల్సిన నిపుణులు వైద్య విధానపరిషత్‌తో పాటు కొత్తగూడెంలోని మెడికల్ కళాశాలలో ఉన్నారు. వీరి సేవలను శిబిరాలకు ఉపయోగిస్తేనే వీటి ఉద్దేశం నెరవేరుతుంది. మాతా శిశు వైద్యానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యమిస్తున్నందున చిన్న పిల్లల వైద్యులు, గైనకాలజిస్టుల సేవలు తప్పనిసరి. గర్భిణులకు, బాలింతలకు పోషకాహార లోపం రాకుండా ఉండేందుకు బలమైన మందులు, టానిక్‌లు ఇవ్వాలి. స్కానింగ్ తీసి గర్భిణులకు తగిన సలహాలు అందించాలి. ఆయా సేవలు అందించేలా గైనకాలజిస్టులకు ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది. జనరల్ మెడిసిన్, కళ్లు, చర్మ, ఎముకల వైద్యనిపుణులు అవసరం. డీసీహెచ్‌ఎస్ పరిధిలోని ఏ ఆసుపత్రి నుంచి ఎంతమందిని కేటాయిస్తున్నారో స్పష్టత రావాల్సి ఉంది.

ప్రతిచోటా 200 నుంచి 400 మంది బాధితులు వచ్చే అవకాశం ఉన్నందున నాణ్యమైన ఔషధాలను అందుబాటులో ఉంచాలి. ఒక్కో క్యాంపు ఏర్పాటుకు రూ.30 వేల చొప్పున అధికారులు కేటాయిస్తున్నారు. వైద్య సిబ్బందికి భోజనాలు, రవాణా ఖర్చులు ఇందులో భాగమే. ఈ నిధులు సరిపోతాయో లేదో పర్యవేక్షించి అవసరమైన చోట ఈ మొత్తాన్ని పెంచాలని గిరిజనులు కోరుతున్నారు.

# ఇది.. నంబర్ 1 నిర్లక్ష్యం!



పాల్వంచ : నిర్వహణ లోపాల కారణంగా గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష రద్దు చేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. 2023 జూన్ 11న జరిగిన ప్రిలిమ్స్‌కు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 5,258 మంది, ఖమ్మం జిల్లాలో 10,945 మంది హాజరయ్యారు.

నిర్వహణ లోపాల కారణంగా గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష రద్దు చేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. 2023 జూన్ 11న జరిగిన ప్రిలిమ్స్‌కు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 5,258 మంది, ఖమ్మం జిల్లాలో 10,945 మంది హాజరయ్యారు. గతంలో ఓసారి పరీక్ష రద్దవగా, రెండోసారి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయకపోవడం అభ్యర్థులకు శాపంగా మారింది. నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా అభ్యర్థుల బయోమెట్రిక్ నమోదు చేయకపోవడంతో పాటు పలు లోపాలను సవాల్ చేస్తూ కొందరు అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో పరిస్థితి అయోమయంగా మారింది. ఉన్నతస్థాయి కొలువే లక్ష్యంగా కొన్నేళ్లుగా పుస్తకాలతో కుస్తీ పడుతున్న వేలాది మంది తలలు పట్టుకుంటున్నారు. మళ్లీ ప్రిలిమ్స్ నిర్వహిస్తే సన్నద్ధత ఆర్థికంగానూ భారంగా మారుతుందని భావిస్తున్నారు. గత ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించిన పలువురి అభ్యర్థుల మనోగతం వారి మాటల్లోనే...

ఈ సారీ అర్హత మార్కులొచ్చాయి కానీ..

నల్గొండ రమేశ్, కొత్తగూడెం

గతేడాది అక్టోబరులో నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీలో 77 మార్కులతో ఉత్తీర్ణత సాధించా. దాన్ని రద్దు చేసి జూన్‌లో నిర్వహించిన పరీక్షలోనూ ప్రాథమిక 'కీ'ని బట్టి చూస్తే 74 మార్కులు వచ్చాయి. కానీ నిర్వహణ లోపాల నేపథ్యంలో పరీక్ష రద్దు చేస్తూ కోర్టు ఇచ్చిన ఆదేశాలతో దిగ్భ్రాంతి చెందా. ఇప్పటికే శిక్షణ కోసం నానా ఇబ్బందులు పడ్డాను. తీరా పలు కారణాలతో పరీక్ష రద్దు చేస్తే మాజీవితాలు ఏంకావాలో అర్థం కావడం లేదు. మానాన్న జయరాజ్ లేరు. అమ్మ విజయరాణి కూలీ పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇలాంటి సమయంలో వారికి భారంగా మారి మళ్లీ పరీక్షకు సిద్ధంకావడం కష్టమే.

తీవ్ర నిరాశలో కూరుకుపోయాం..

దంసలపూడి చాముండేశ్వరి, పాల్వంచ

గ్రూప్-1 నోటిఫికేషన్ కోసం కొన్నేళ్లుగా నిరీక్షిస్తున్నా. గతేడాది జరిగిన ప్రిలిమ్స్‌లో ఎలాగైనా విజయం సాధించాలని సిద్ధమయ్యా. అష్టకష్టాలు పడి పరీక్షలు రాస్తే.. రెండోసారీ రద్దు చేసే పరిస్థితులున్నాయి. దీంతో అభ్యర్థులమంతా తీవ్ర నిరాశలో కూరుకుపోయాం. అక్టోబరు 16న రాసిన ప్రిలిమ్స్‌లో 77 మార్కులు రాగా.. ఈ ఏడాది రెండోసారి జరిగిన పరీక్షలో 74 మార్కులొస్తున్నాయి. అర్హత సాధించామన్న సంతోషం వెంటనే ఆవిరైపోయింది. పరీక్షల్లో లోపాలు ఎన్నో జీవితాలు, కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయని నిర్వాహకులు గమనించాలి. ఒకసారి పొరపాటు జరిగినా.. రెండోసారీ జాగ్రత్త పడకపోవడం గమనార్హం. ఇప్పుడు పరీక్షలంటేనే భయమేస్తోంది.

ఐదు ఉద్యోగాల్ని వదిలేశా

నంద్రు శ్యాంనాగేంద్ర, అశ్వాపురం

గ్రూప్-1 ఉద్యోగం సాధించాలనే తపనతో ఇప్పటి వరకు అయిదు ప్రభుత్వ ఉద్యోగాలు వదిలేశా. ప్రిలిమ్స్‌లో రెండుసార్లూ అర్హత మార్కులు సాధించా. గతేడాది పరీక్షలో 81, ప్రస్తుతం ప్రాథమిక 'కీ' ప్రకారం 78 మార్కులు వచ్చాయి. ఈ సంతోషం ఎంతో కాలం నిలవలేదు. వరుసగా పరీక్షలు రద్దవుతుండటంతో మానసిక ఆందోళన పెరిగిపోతోంది. గతంలో రైల్వే, హైకోర్టు, ఇతర విభాగాల్లో పోటీ పరీక్షలకు హాజరవగా సుమారు అయిదు ఉద్యోగాలొచ్చాయి. కానీ నా లక్ష్యం గ్రూప్-1 కావడంలో వాటిల్లో చేరలేదు. అమ్మానాన్నలు భూపతి, భద్రమ్మ వ్యవసాయం చేస్తారు. గ్రూప్స్ శిక్షణకు గత రెండేళ్లలో రూ.3 లక్షల వరకు ఖర్చు చేశా. టీఎస్‌పీఎస్సీ అధికారులు లోపాల్లేకుండా పరీక్షలు నిర్వహించాలి.


కూలీ పనులకు వెళ్లి చదివిస్తున్నారు

బాసిపోగు భవాని, భద్రాచలం

మాది నిరుపేద కుటుంబం. తల్లిదండ్రుల రెక్కాడితేగాని కుటుంబం గడవని పరిస్థితులు మావి. ఇలాంటి సమయంలో కూలీనాలి చేసి నన్ను చదివిస్తున్నారు. గతేడాది ప్రిలిమ్స్‌లో 70 మార్కులు సాధించా. మెయిన్స్‌కు సిద్ధమవుతున్నంతలో పరీక్ష రద్దయిందన్న పిడుగుపాటు వార్త వినిపించింది. అయినా కష్టపడి మళ్లీ చదివా. ఎలాగోలా పరీక్ష రాశా. ఇప్పుడూ రద్దుచేస్తామంటే మాలాంటి పేద అభ్యర్థుల పరిస్థితి ఏమవుతుందో ప్రభుత్వం ఆలోచించాలి. మా అమ్మ తిరుపతమ్మ ఇళ్లల్లో పనికి వెళ్లి నన్ను చదివిస్తున్నారు. నాన్న మల్లయ్య దుకాణంలో పనిచేస్తారు. రోజంతా వారు కష్టపడితే కుటుంబం గడుస్తుంది. ఇలాంటి తరుణంలో వారికి అండగా ఉండాలని పోటీ పరీక్షలు సిద్ధమవుతున్నా.

# ఎన్ఆర్ఐ దాతృత్వం.. పంచాయతీకి భవనం

భద్రాచలం : ఏదేశమేగినా ఎందుకాలిడినా పుట్టిన గ్రామంపై ప్రేమతో ఎన్ఆర్ఐ వేమిరెడ్డి వెంకటరెడ్డి రూ.70 లక్షలతో ఎర్రుపాలెం మండలంలోని భీమవరంలో గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించారు. ఆ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో జడ్పీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజు మాట్లాడారు. గ్రామంలో పాఠశాల భవనాన్ని, ఆలయాన్ని, ఆరోగ్య ఉపకేంద్ర భవనాన్ని నిర్మించి పుట్టిన గ్రామ ప్రజలకు సేవ చేస్తున్నారని దాత వెంకటరెడ్డిని అభినందించారు. దాత వెంకటరెడ్డి మాట్లాడుతూ అందరం కలిసి పార్టీలు, వర్గాలు, కులాలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. అనంతరం దాత వెంకటరెడ్డిని కమల్‌రాజు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. తొలుత గ్రామస్థులు వెంకటరెడ్డి, కమల్‌రాజులకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు ఎస్.కవిత, ఎంపీపీ డి.శిరీష, సర్పంచి ఎస్.జయలక్ష్మీ, ఎంపీటీసీ ఎస్.కృష్ణారావు, చావా రామకృష్ణ, భారాస మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు, ఎస్.శ్రీకాంత్‌రెడ్డి, మూల్పూరి శ్రీనివాస్,



ఎం.అప్పారావు, వై.శ్రీనివాసరెడ్డి, ఎస్.రామకోటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, ఎ.సాంబశివరావు పాల్గొన్నారు.

# హడావుడి పనులతో ప్రజాధనం వృథా..!

ఏటూరునాగారం : పండుగలు వచ్చాయంటే కొందరు ఇంజినీర్లు, గుత్తేదారులకు కాసుల పంటే. ప్రతి సంవత్సరం గణేశ్ నిమజ్జనం, సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల పేరుతో చెరువులు, కుంటల వద్ద తాత్కాలిక పనులు చేయడం పరిపాటిగా మారింది. రహదారుల మరమ్మతులు, లైటింగ్ ఏర్పాటు పేరుతో పెద్ద ఎత్తున ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారు. అవే చెరువులు, అవే మైదానాలు.. కానీ శాశ్వత పనులు చేపట్టడం లేదు. ఈ ఏడాది గణేశ్ నిమజ్జనం ఖర్చు రూ.2 కోట్లు దాటిందంటే అతిశయోక్తి కాదు. గ్రేటర్ వరంగల్ పరిధిలో సాధారణ నిధులతో 25 ప్రాంతాల్లో ఏర్పాట్లు చేశారు. సుమారు 8 వేలకు పైగా విగ్రహాలు గంగమ్మ ఒడికి భక్తులు చేర్చారు.

గ్రేటర్ పైనే భారం

అన్ని ప్రభుత్వ శాఖలు హడావుడి చేస్తాయి కానీ ఖర్చంతా గ్రేటర్ వరంగల్ పైనే పడుతుంది.

అద్దె క్రేన్లు, హిటాచీలు, జేసీబీలు ఏర్పాటు చేసిన నీటిపారుదల శాఖ రూ. 50 లక్షల ప్రతిపాదనలు బల్దియాకు పంపింది.



25 చెరువులు, కుంటల వద్ద బారికేడ్లు పెట్టిన ఆర్అండ్‌బీ రూ. 55 లక్షలు కోరింది.వాహనాలు సరఫరా చేసినందుకు రవాణా శాఖ రూ.6 లక్షలు చెల్లించాలంది.ఇతర శాఖలు రూ.10 లక్షల ప్రతిపాదనలు కార్పొరేషన్‌కు పంపించాయి.బల్దియా రూ.79 లక్షలతో రహదారుల మరమ్మతులు, లైటింగ్, జనరేటర్లు, డీజిల్, పెట్రోల్ తదితర పనులకు వ్యయం చేశారు.

టెండర్ లేకుండానే లైటింగ్ పనులుగ్రేటర్ వరంగల్ ఎలక్ట్రికల్ విభాగం లైటింగ్ పనుల్లో కొందరు ప్రైవేటు ఎలక్ట్రికల్ గుత్తేదారులు జత కట్టి పంపకాలు చేసుకుంటున్నారు. ఓ ఇంజినీరింగ్ అధికారి చెరువుల వారీగా ప్రైవేటు ఎలక్ట్రికల్ దుకాణదారులకు కేటాయించారు. 25 చెరువుల వద్ద లైటింగ్ పనుల కోసం సుమారు రూ.40-45 లక్షలు కేటాయించారు. వ్యయం వివరాలు గోప్యంగా ఉంచుతున్నారు. కొన్నేళ్లుగా లైటింగ్ పనులు నామినేషన్‌పై ఇస్తున్నారు. సివిల్ పనులకు టెండర్లు పిలిచి ఎలక్ట్రికల్ పనులు నామినేషన్‌పై కేటాయించడం తీవ్రమైన విమర్శలకు తావిస్తోంది.

# తరలింపునకు సన్నాహాలు.. తీరనున్న తిప్పలు

గోదావరిఖని : గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలోని రక్తశుద్ధి కేంద్రాన్ని నూతన భవనంలోకి తరలించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సుమారు ఐదేళ్ల క్రితం గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి మొదటి అంతస్తులో మూత్రపిండ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలోని రక్తశుద్ధి కేంద్రాన్ని నూతన భవనంలోకి తరలించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సుమారు ఐదేళ్ల క్రితం గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి మొదటి అంతస్తులో మూత్రపిండ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మొదటి అంతస్తులో ఉండడంతో రోగులు పైకి వెళ్లడం ఇబ్బందిగా ఉందని, గ్రౌండ్ ఫ్లోర్‌లోకి మార్చాలంటూ రోగులతో పాటు పలు సామాజిక సంస్థల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఆసుపత్రి ఇతర అవసరాలకు ప్రస్తుత రక్తశుద్ధి కేంద్ర విభాగాన్ని వినియోగించుకుంటూ ఈ కేంద్రాన్ని నూతన భవనంలోకి తరలించేందుకు ఆసుపత్రి వర్గాలు నిర్ణయం తీసుకున్నాయి. డి.సి.డి.సి. సంస్థ నిర్వహకులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

అయిదేళ్లుగా రోగులకు తిప్పలు

రక్తశుద్ధి కేంద్రం మొదటి అంతస్తులో ఉండడంతో గతంలో డయాలసిస్ రోగులు నానా తిప్పలు పడేవారు. వీరిలో చాలామంది నడవని పరిస్థితుల్లో మెట్లు ఎక్కలేక బంధువులు సహాయంతో చక్రాల కుర్చీపై ర్యాంప్ ద్వారా మొదటి అంతస్తులోకి వెళ్లేవారు. ఇటీవల ఆసుపత్రిలో లిఫ్టు సదుపాయం కల్పించిన అది తరుచూ మొరాయిస్తుండడంతో రోగులు ర్యాంపు ద్వారానే వెళ్లాల్సి వచ్చేది. రక్తశుద్ధికి వెళ్లేవారు, తిరిగి వచ్చే వారు ప్రమాదవశాత్తు కింద పడిన సంఘటనలున్నాయి. నూతన భవనంలో చివరి పడకలను రక్తశుద్ధి కేంద్రం ఏర్పాటునకు కేటాయించగా ఇందులో శుద్ధజల కేంద్రం కూడా ఏర్పాటు చేయనున్నారు. త్వరలోనే రక్తశుద్ధి కేంద్రాన్ని నూతన భవనంలోకి తరలించేందుకు సంబంధిత అధికారులు ఉంటూ చర్యలు తీసుకుంటున్నారు.

# అంతర్గత రహదారులకు మహర్దశ

కరీంనగర్ : కరీంనగర్ స్మార్ట్‌సిటీ నిధులతో అత్యధిక ప్రధాన రహదారులు అన్ని హంగులతో మెరుగుపడ్డాయి. శివారు, నిధుల సమస్యతో నిలిచిపోయిన అంతర్గత వీధుల రోడ్లకు ఎట్టకేలకు మహర్దశ కలిగింది. ముఖ్యమంత్రి హామీ నిధులు(సీఎంఏ) మంజూరు చేయడంతో కనీస సౌకర్యాలు మెరుగు పర్చుకోవడానికి వీలు కలిగింది. పూర్తి వివరాలతో కథనం.

అన్ని డివిజన్లకు ప్రాధాన్యం

ప్రధానంగా స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో లేని కాలనీలు, శివారు ప్రాంతాలు, విలీన కాలనీలకు సీఎంఏ నిధులలో ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఒక్కో డివిజన్‌కు కనీసం రూ.కోటి నుంచి రూ.4 కోట్ల వరకు కేటాయించినట్లుగా చెబుతున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులు కూడా ఇందులోనే పూర్తి చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

ప్యాకేజీ పద్ధతిలో టెండర్లు..

స్మార్ట్‌సిటీలో ప్యాకేజీ పద్ధతిలోనే అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. తద్వారా పనుల్లో వేగం, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేశారు. సీఎంఏ నిధులకు సంబంధించి కొత్తగా ఇచ్చిన ప్రతిపాదనలకు సింగిల్ ప్యాకేజీలో టెండర్లు పిలిచారు. గతంలో టెండర్లు దక్కించుకొని పనులు చేయకుండా మొండికేసిన గుత్తేదారులతో ప్రజలు, పాలకవర్గ సభ్యులు ఇబ్బందులుపడిన విషయం తెలిసిందే. పైగా పనులు చేస్తామని చెప్పి తవ్వి వదిలేయడంతో రాకపోకలు సాగించే ప్రజలు అవస్థలు పడ్డారు. అలాంటి సమస్యలు రాకుండా గడువులోగా పనులు చేసేలా చర్యలు చేపట్టారు..

నేడు ప్రారంభించనున్న మంత్రి పాలకవర్గ సభ్యులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పనులకు ముహూర్తం కుదిరింది. ముఖ్యమంత్రి హామీ నిధులకు సంబంధించిన రూ.133 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రి గంగుల కమలాకర్ శ్రీకారం చుట్టనున్నారు.

# యువికా.. నవ శాస్త్రవేత్తల వేదిక

కొత్తగూడెం : విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి యువ శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చక్కని అవకాశం కల్పిస్తోంది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో తొమ్మిదో తరగతి చదువుతోన్న విద్యార్థుల నుంచి శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. యువికా (యువ విజ్ఞాని కార్యక్రమం) పేరుతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శిక్షణకు హాజరయ్యేందుకు రవాణా ఛార్జీలు, బస, భోజన వసతితోపాటు అన్ని సౌకర్యాలను ఇస్రో కల్పించనుంది.

దరఖాస్తు విధానం..

విద్యార్థులు నాలుగు దశల్లో దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది.

మొదట వారి ఈ-మెయిల్ ఐడీతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

రిజిస్ట్రేషన్ చేసుకున్న 48 గంటల వ్యవధిలో ఇస్రో ఏర్పాటుచేసిన ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలి.

క్విజ్ పూర్తి చేసిన 60 నిమిషాల తర్వాత యువికా పోర్టల్‌లో ఆన్‌లైన్ దరఖాస్తుతో పూర్తి వివరాలు నమోదు చేసి సమర్పించాలి.

దరఖాస్తుతోపాటు విద్యార్థి సంతకం చేసిన ప్రతి, విద్యార్థి గత మూడేళ్లలో వివిధ అంశాలలో సాధించిన ప్రగతికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాలి.

దరఖాస్తులు సమర్పించేందుకు ఈ నెల 20 నుంచి ఏప్రిల్ 3 వరకు అవకాశం కల్పించారు. ఎంపిక జాబితాలను ఏప్రిల్ 20న ప్రకటించి అర్హత సాధించిన వారికి సమాచారం అందిస్తారు.

ఎంపిక ఇలా..

ప్రస్తుతం తొమ్మిదో (2022-23) తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు. గ్రామీణ ప్రాంతాల వారికి తొలి ప్రాధాన్యం ఉంటుంది. ఎనిమిదో తరగతిలో పొందిన మార్కులు, మూడేళ్లలో పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించిన ఏదైనా వైజ్ఞానిక ప్రదర్శనలో భాగస్వామ్యం, సైన్స్ ప్రతిభ పరీక్షలు, ఒలంపియాడ్‌లో పాల్గొని మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి ప్రాధాన్యం ఇస్తారు. రిజిస్టర్డ్ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడలు, అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటినవారు, స్కౌట్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌లో సభ్యులు, ఆన్‌లైన్ క్విజ్‌లో ప్రతిభ చూపిన వారికి ఎంపికలో ప్రాధాన్యం ఉంటుంది.

మే 15 నుంచి 26 వరకు శిక్షణ..

శిక్షణకు ఎంపికైన విద్యార్థులకు వేసవి సెలవుల్లో మే 15 నుంచి 26 వరకు 12 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. పూర్తిగా రెసిడెన్షియల్ పద్ధతిలో ఉంటుంది. విద్యార్థితోపాటు తల్లిదండ్రుల్లో ఒకరు లేదా గైడ్ ఉపాధ్యాయుడికి కూడా ప్రయాణ ఖర్చులు చెల్లిస్తారు. శిక్షణ తర్వాత శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌కు తీసుకెళ్లి అక్కడి విశేషాలను ప్రత్యక్షంగా చూపించి అవగాహన కల్పిస్తారు.

శిక్షణ కేంద్రాలు..

ఎంపికైన విద్యార్థుల కోసం ఏడు కేంద్రాల్లో శిక్షణ ఇస్తారు.

1) ఐఐఆర్ఎస్, డెహ్రాడూన్
2) విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్, తిరువనంతపురం
3) సతీష్ ధావన్ స్పేస్ సెంటర్, శ్రీహరికోట
4) యు.ఆర్.రావు శాటిలైట్ సెంటర్, బెంగళూరు
5) స్పేస్ అప్లికేషన్ సెంటర్, అహ్మదాబాద్
6) నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, హైదరాబాద్
7) నార్త్-ఈస్ట్ స్పేస్ అప్లికేషన్ సెంటర్, షిల్లాంగ్.

విద్యార్థులను ప్రోత్సహించాలి

చలపతి రాజు, జిల్లా సైన్స్ అధికారి

వైజ్ఞానిక పోటీల్లో పాల్గొనేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. చిన్నతనం నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన, అంతరిక్ష పరిశోధన రంగాలపై ఆసక్తి పెంచడానికి యువికా తోడ్పడుతుంది. ఎంపికైన విద్యార్థులకు స్పేస్ సెంటర్ ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వివరాలకు నం.9247296012 సంప్రదించాలి.

# కారుణ్య నియామకాలు.. తిరకాసు పర్వాలు

ఇల్లెందు : రాష్ట్రంలోని 11 సింగరేణి ఏరియాల్లో రెండు రకాల పేర్లు సమస్యగా మారాయి. పేర్ల తప్పులతో సుమారు 550 నుంచి 600 మంది కార్మికులు, వారి కుటుంబ సభ్యులు అవస్థలు పడుతున్నారు. కారుణ్య నియామకాలు, పింఛను తీసుకొనే సమయంలో సమస్య వారిని వేధిస్తోంది. కార్మికులకు సింగరేణి సర్వీసు రికార్డుల్లో ఒక పేరు ఉండటం, వారి ఇంటి వద్ద ఆధార్‌కార్డు తదితర చదువుకొనే పత్రాల్లో మరో పేరు ఉంటుంది. ఈక్రమంలో కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్న కార్మికుల వారసులకు సర్వీసు రికార్డులో ఉన్న పేరు కాకుండా, ఇంటి వద్ద ఉన్న(కార్మికుని) పేరుతో ఆధార్ తదితర విద్యా, కుల ధ్రువీకరణ పత్రాలు ఉంటున్నాయి. దీంతో పేర్లలో తేడా ఉన్నాయని సాకు చూపిస్తూ కార్మికుల వారసులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు అధికారులు ససేమీరా అంటున్నారు.

ఇవీ ఉదాహరణలు పట్టణంలోని ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన ఓ కార్మికుడు ఏడాదిన్నర క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన పేరు సింగరేణి రికార్డులో ఒకటి, ఇంటి వద్ద మరోటి వేరుగా ఉంది. ఆయన కుమార్తె కారుణ్య నియామకానికి దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు గనిలో, వారు నివసించే ప్రాంతంలో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. ఆ కార్మికుడి కుమార్తెగా నిర్ధారించుకున్నారు. కానీ పేరు వేర్వేరుగా ఉందనీ ఇల్లెందు ఏరియా సింగరేణి అధికారులు 6 నెలల నుంచి ఆమెకు ఉద్యోగం ఇవ్వకుండా ఆపుతున్నారు. కార్మికుడు మృతి చెంది ఉద్యోగం రాక కార్మికుడి భార్య, కుమార్తె ఆవేదన చెందుతున్నారు.

ఒక కార్మికుడు ఉద్యోగంలో చేరే క్రమంలో పేరు తప్పుగా నమోదైంది. కులం పేరును ఇంటి పేరుతో కలపి నమోదు చేశారు. అదే పేరుతో కార్మికుడు ఉద్యోగం చేసుకుంటూ వచ్చాడు. కానీ కార్మికుని పిల్లలు మాత్రం వారి అసలైన ఇంటి పేరుతోనే చదువు కొనసాగించారు. ఆ కార్మికుడి వారసుడికి ఉద్యోగం ఇచ్చే క్రమంలో పేర్లు తప్పులు ఉన్నాయని ఉద్యోగం ఇవ్వకుండా అధికారులు నిలిపివేస్తున్నారు.

సంస్థ నిబంధనల ప్రకారం ఉద్యోగాలిస్తాం

జీవీ మోహన్‌రావు, డీజీఎం పర్సనల్ సింగరేణి సంస్థ నిబంధనల ప్రకారం సర్వీస్ రికార్డుల్లో ఉన్న కార్మికుల పేరు ఆధారంగా కారుణ్య నియామకాల్లో వారి వారసులకు ఉద్యోగాలు ఇస్తాం. కార్మికుని ఇంటి పేరు, అసలు పేరుకు సంబంధం లేకుండా ఉన్న వారు దరఖాస్తు చేసుకుంటే ఉద్యోగం ఇవ్వలేం. రెండు పేర్లకు సంబంధించి వన్‌టైం సెటిల్‌మెంట్ అనుమతి ఇంకా సంస్థలో రాలేదు. వన్‌టైం సెటిల్‌మెంట్‌కు అవకాశం కల్పించాలిఎస్.రంగనాథ్, తెబొగకాసం ఏరియా ఉపాధ్యక్షులురెండు పేర్ల సమస్యతో గత కొన్నేళ్ల నుంచి కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు పేర్లు, పేర్ల తప్పులపై వన్‌టైం సెటిల్‌మెంట్‌కు అవకాశం కల్పించాలని మా సంఘం రాష్ట్ర నాయకులు పలుమార్లు యాజమాన్యానికి వినతులు ఇచ్చారు.

# పవిత్ర బంధం.. ఎగతాళి



కొత్తగూడెం : సహజీవనానికి అడ్డొస్తున్నాడన్న కోపంతో కొత్తగూడెం సన్యాసిబస్తీకి చెందిన గాయపాక ప్రవీణ్‌కుమార్ (35)ను ప్రియుడితో కలిసి భార్య లావణ్య అంతమొందించింది. తనతో విడాకులు తీసుకోకుండా వేరొకరితో సహజీవనం చేస్తున్నావెందుకని నిలదీయడమే అతని పాలిట మృత్యుపాశమైంది.

జనవరి 4: చుంచుపల్లి మండలం గాంధీకాలనీకి చెందిన శ్రీనివాస్‌కు 29 ఏళ్ల క్రితం సీతామహాలక్ష్మితో వివాహమైంది. రెవెన్యూ శాఖలో అటెండర్‌గా పనిచేసే అతడు మద్యానికి బానిసయ్యాడు. రెణ్నెల్ల క్రితం మద్యం మత్తులో ఇంటికి వచ్చిన భర్తను భార్య కర్రతో కొట్టి చంపింది. ఇంట్లో జారిపడ్డాడని నమ్మించే ప్రయత్నం చేసింది.

జనవరి 20: గుండాల మండలానికి చెందిన ఓ యువతితో అదే గ్రామానికి చెందిన యువకుడికి నాలుగేళ్ల క్రితం వివాహమైంది. కట్న వేధింపులతో భార్య పుట్టింటికి వెళ్లగా.. భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని ఇంటికి తీసుకొచ్చాడు. నిలదీసేందుకు వెళ్లిన అత్తింటి వారిపై యవకుడు దాడి చేయగా.. వారు ప్రతిదాడికి పాల్పడ్డారు.

జనవరి 26: ఖమ్మం జిల్లా చింతకానికి చెందిన రాంబాబు (పేరుమార్చాం)కు మహబూబాబాద్ జిల్లా మరిపెడకు చెందిన మహిళతో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. అతడు మద్యానికి బానిసయ్యాడు. పెద్ద మనుషుల్లో పంచాయితీ పెట్టినా మారలేదు. ఓ రోజు అతడు భార్యపై ఆగ్రహంతో గొడ్డలితో విచక్షణా రహితంగా దాడిచేశాడు.

అనుమానం.. వివాహేతర సంబంధం.. మద్యం అలవాటు.. ప్రస్తుతం భార్యాభర్తల మధ్య విభేదాలకు ఇవే ముఖ్య కారణాలుగా నిలుస్తున్నాయి. కొందరు తెగించి బంధాలను అడ్డుతొలగించుకునేందుకూ వెనకాడటం లేదు. ఇటీవల కాలంలో ఉమ్మడి ఖమ్మంలో ఇలాంటి సంఘటనలు వరుసగా చోటు చేసుకుంటున్నాయి. అధిక శాతం భర్త మద్యం అలవాటు కారణంగా సంసారాల్లో చిచ్చురేగుతోంది. మత్తుకు బానిసైన వారిలో 'అనుమానం' పెనుభూతం అవుతోంది. ఇది దంపతుల మధ్య ఎడబాటుకు కారణమవుతోంది. సర్దుబాటుతో సమస్య తీరే అవకాశం ఉన్నా.. కక్షతో దాడులు, ప్రతిదాడులకు పాల్పడుతున్నారు. మరికొందరు వ్యక్తిగత సుఖం కోసం పెడదోవ పడుతున్నారు. వివాహేతర సంబంధాలతో కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. భర్త ప్రవర్తనతో వేగలేక కొందరు ఆత్మహత్యే శరణ్యమని భావిస్తున్నారు. ఆగ్రహావేశాలు పక్కనపెడితే, ప్రతి సమస్యకూ ఓ పరిష్కారం దొరుకుతుందని, మానసిక నిపుణులు, పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

భార్యాభర్తల మధ్య మనస్పర్థలకు కారణాలివే..

పరస్పర అవగాహన లేకపోవడం. పట్టుదల, పంతాలకు వెళ్లడం.

ఒకరిపై మరొకరు విశ్వాసం కోల్పోవడం. అనుమానాలు పెనుభూతంగా మారడం. పరువు, ప్రతిష్ఠలకు భంగం కలిగిందని.. ప్రతీకారమే శరణ్యమనుకోవడం. మద్యం కారణంగా కుటుంబాన్ని పట్టించుకోకపోవడం. వివాహేతర సంబంధాలు. అదనపు కట్నం వేధింపులుధనాపేక్ష, మితిమీరిన స్వేచ్ఛ కోరుకోవడంక్షణికావేశానికి లోనై తీవ్ర నిర్ణయాలు తీసుకోవడం.

# చేతిపంపుల మరమ్మతులకు పైసలేవి



కొత్తగూడెం : వేసవి వచ్చిందంటే కొన్ని గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు తప్పటం లేదు. గతంలో ఎండాకాలం సమీపిస్తున్న తరుణంలో తాగునీటి ఎద్దడి పరిష్కారానికి ప్రణాళికలు తయారుచేసేవారు. ప్రస్తుతం ఆ ఊసే లేదు. మిషన్ భగీరథ నీరు అన్ని గ్రామాలకు సరఫరా చేస్తున్నామని అధికారులు చెబుతుండటంతో ప్రణాళికల్ని పూర్తిగా పక్కనపెట్టేశారు. కానీ క్షేత్ర స్థాయిలో భగీరథ నీరు అందని గ్రామాలు ఉభయ జిల్లాల్లో చాలా ఉన్నాయి. అలాంటిచోట ప్రధాన నీటి వనరు చేతిపంపులే. పరోక్షంగా అధికారులు దీన్ని అంగీకరిస్తూనే చేతిపంపుల బాధ్యతను పంచాయతీలకు అప్పగించారు. పంచాయతీ నిధులతో మరమ్మతులు చేయించాలని ఆదేశాలైతే ఇచ్చారు కానీ ఖజానాలో డబ్బుల్లేవనే సంగతిని మరిచారు.

ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఉన్నప్పుడు గ్రామాల్లో చేతిపంపు నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక ఉండేది. వాటికి సంబంధించిన సామగ్రి మొత్తం ప్రభుత్వం నుంచి వచ్చేవి. వేసవి రాగానే మెకానిక్‌లతో పనులు చక్కబెట్టేవారు. మిషన్ భగీరథ పట్టాలెక్కిన తర్వాత బోర్ల నిర్వహణను గాలికొదిలేశారు. పంచాయతీలకు బాధ్యత అప్పగించారు. ప్రతి మండలంలో 250 నుంచి 550 వరకు చేతిపంపులున్నాయి. వాటికి సంబంధించిన హ్యాండిల్, పైపులు, ఇతరత్రా సామగ్రి ధరలు గణనీయంగా పెరిగాయి. నిధులు లేకపోవడంతో నెలలుగా కొనుగోలు చేసే పరిస్థితి లేదు. ఎక్కువగా ఉపయోగించే ప్రాంతంలో మాత్రం కొంతవరకు నిధులు ఖర్చుచేస్తున్నారు. ఇంకోపక్క భగీరథ నీరు అందడం లేదని మండల పరిషత్తు సమావేశాల్లో సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తల్లాడ మండలం కుర్నవల్లిలో భగీరథ నీరు సరిపడా రాకపోవడంతో పంచాయతీ బోరుపైనే ఆధారపడుతున్నారు.

కొణిజర్ల మండలం విక్రమ్‌నగర్, ఉప్పలచెలక, కాచారం గ్రామాలకు సక్రమంగా మిషన్ భగీరథ నీరు సరఫరా కావటం లేదు. దీనిపై ఇటీవల మండల పరిషత్తు సమావేశంలో అధికారులను సర్పంచులు పలుమార్లు నిలదీశారు. పాఠశాలల్లో ఉన్న చేతిపంపులు పనిచేయకపోవడంతో మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు అనేకచోట్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధిర, కూసుమంచి, బోనకల్లు, తిరుమలాయపాలెం, ఇతర మండలాల్లోనూ మిషన్ భగీరథ నీరు అందని సమయంలో చేతిపంపులపైనే ఆధారపడుతున్నారు.

రూ.2-5 వేల ఖర్చు

పంచాయతీల్లో నిధులు నిండుకున్నాయి. డబ్బుల్లేకుండా చేతిపంపుల మరమ్మతులు ఎలా చేయాలో అర్థంకాక సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. ఇంటి పన్నులు వసూలు చేస్తే వచ్చే జనరల్ ఫండ్‌ను చిన్నచిన్న అవసరాలకు ఉపయోగించుకుంటున్నారు. రాష్ట్రం, కేంద్రం ఇచ్చే నిధులు ఆరు నెలల నుంచి రావడంలేదు. కేంద్రం అడపాదడపా నిధులిస్తే అవి గతంలో చేసిన పనులకు సరిపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు నెలకు పంచాయతీ జనాభా బట్టి రూ.1.50 లక్షల నుంచి రూ.6లక్షల వరకు వస్తుంటాయి. కేంద్రం కూడా అంతే మొత్తంలో అందించాల్సి ఉండగా అరకొర నిధులతో సరిపెడుతుంది. పంచాయతీలో జమ అయినట్లు కనపడుతున్నా వాస్తవానికి ఆ పరిస్థితి ఉండటం లేదు. ఒక్కో చేతిపంపునకు మరమ్మతులు చేయాలంటే రూ.2వేల నుంచి రూ.5వేల వరకు ఖర్చవుతుంది.

50శాతానికి పైగా..

ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహణ లేక 50శాతం చేతిపంపులు మూలనపడ్డాయి. వేసవి వస్తే నీరు అడుగంటిన బోర్లను గుర్తించి గతంలో ఫ్లషింగ్ చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో ప్రజలే స్వచ్ఛందంగా డబ్బులు వేసుకుని మరమ్మతులు చేయించుకుంటున్నారు. ఎప్పుడైనా మిషన్ భగీరథ నీరు నిలిచిపోతే వీటిపైనే ఆధారపడుతున్నారు.

# రైతు వేదికలతో ఎరువులు చేరువ

ఖమ్మం : అన్నదాతలకు ఎరువులను చేరువ చేసేందుకు రైతు వేదికలను వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వానాకాలం సీజన్ నుంచే జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)ల ఆధ్వర్యంలో రైతు వేదికల్లో ఎరువులు విక్రయించేందుకు సన్నాహాలు చేస్తోంది. రైతు వేదికల వారీగా ఎరువుల అవసరాల వివరాలు సేకరించే పనిలో నిమగ్నమైంది. పంటలకు కావాల్సిన ఎరువుల్లో 50శాతం వరకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు, డీసీఎంఎస్‌ల ద్వారా ప్రభుత్వమే నిర్ణీత ధరలకు సరఫరా చేస్తుంది. మిగిలిన 50 శాతం ప్రైవేటు డీలర్లకు కేటాయిస్తుంది.

ఇక్కట్లు తప్పినట్లే..!కర్షకులకు మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి 5వేల ఎకరాలకు ఒక క్లస్టర్ ఏర్పాటుచేసి అక్కడ రైతు వేదికలు నిర్మించింది. వాటిలో ఏఈవోలను నియమించింది. వేదికల్లో వారంలో ఆరు రోజులు వ్యవసాయానికి సంబంధించిన సదస్సులు నిర్వహిస్తోంది. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలతో రైతులకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తోంది. ఇక నుంచి జిల్లా సహకార మార్కెటింగ్ సంస్థ(డీసీఎంఎస్) ఎరువులను కొని రైతు వేదికలకు పంపిస్తుంది. ఏఈవో ఆధ్వర్యంలో వాటిని రైతులకు విక్రయిస్తారు. ఎరువుల నిల్వ, భద్రతకు సంబంధించిన విషయాలను డీసీఎంఎస్ పర్యవేక్షిస్తుంది. దీనివల్ల రైతులు ఎరువుల కోసం ఇబ్బంది పడే అవకాశం ఉండదు. డీసీఎంఎస్ ద్వారా ఎరువులు విక్రయించాలనే ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. రైతులకు తక్కువ ధరకే నాణ్యమైన ఎరువులు సరఫరా చేస్తాం.

# వంతెన లేక గిరిజనుల వెతలు

ములుగు : రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలకు మెరుగైన రవాణాకు పెద్దపీట వేస్తోంది. రహదారుల నిర్మాణానికి రూ.కోట్ల నిధులు వెచ్చిస్తోంది. అయితే ఏజెన్సీ ప్రాంతాల్లో వాగులు ఉన్న చోట వారధుల నిర్మాణం చేపట్టకపోవడంతో గిరిజనం కష్టాలు పడాల్సి వస్తోంది. వెంకటాపురం మండలంలోని మల్లాపురం, కర్రివానిగుంపు గిరిజనులు వర్షాకాలంలో కంకలవాగు వల్ల రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. తారుదారి నిర్మించినా ప్రయోజనం లేకుండా పోతోంది. ఓ మోస్తరు వర్షానికే వాగు ఉప్పొంగి రోజుల తరబడి బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

రూ.4.11 కోట్లతో ప్రతిపాదనలు

కంకలవాగుపై వంతెన నిర్మాణానికి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదించారు. తొలుత ఇక్కడ రూ.25 లక్షలతో శ్లాబ్ కల్వర్టు నిర్మించేందుకు నిధులు కేటాయించినా ఆ పనులను రద్దు చేశారు. వరద ప్రభావిత ప్రాంత ప్రత్యేక కోటా కింద రూ.4.11 కోట్ల నిధులతో హైలెవల్ వంతెన కట్టేందుకు నిర్ణయించారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా ఇటీవలే టెండరు ప్రక్రియ సైతం పూర్తైనట్లు తెలుస్తోంది. వారధి నిర్మించేందుకు ఇదే అనువైన



సమయం. అధికారులు త్వరితగతిన పనులు చేపడితే వచ్చే వానాకాలంలోనైనా గిరిజనులకు మోక్షం కలిగే అవకాశం ఉంటుంది.

త్వరలో పనులు ప్రారంభిస్తాం: రాజేశ్, పీఆర్ ఏఈఈ

వంతెన నిర్మాణానికి సంబంధించి ఇటీవల టెండరు ప్రక్రియ పూర్తైనట్లు ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందింది. వరంగల్‌కు చెందిన ఓ గుత్తేదారు ఈ పనులు దక్కించుకున్నట్లు తెలిసింది. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి వర్షాకాలంలో రాకపోకలు కొనసాగేలా చర్యలు తీసుకుంటాం.

వాగు ఉప్పొంగితే రాకపోకలు బంద్

మల్లాపురం, కర్రివానిగుంపు గిరిజన గ్రామాలకు మండల కేంద్రానికి చేరువ చేసేందుకు ప్రభుత్వం సంకల్పించింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో పీఎంజీఎస్‌వైలో భాగంగా రహదారి ఆధునికీకరణ, కల్వర్టు నిర్మాణానికి రూ.3.62 లక్షలు మంజూరు చేసింది. దాదాపు 5.3 కి.మీ మేరకు అధికారులు మట్టిరోడ్డును తారుదారిగా మార్చారు. గ్రామాల్లో సిమెంట్ రహదారులను నిర్మించారు. పలు ప్రాంతాల్లో కల్వర్టులను కట్టారు. కానీ ఈ మార్గంలోని కంకలవాగుపై వారధి నిర్మాణం చేపట్టకపోవడంతో వానాకాలంలో అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. గతేడాది జులై, ఆగస్టులో కురిసిన వర్షాలకు దాదాపు నెల రోజులకు పైగా ఈ మార్గంలో రాకపోకలు నిలిచాయి. అత్యవసర సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడపాల్సి వస్తోంది.

# పంటరుణ పరిమితి పెంపు

జగిత్యాల : వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చులు పంటపంటకూ పెరుగుతున్న తరుణంలో బ్యాంకుల ద్వారా రైతులకు అందించే పంటరుణ పరిమితిని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో అన్నిరకాల పంటలకు 2023-24 వానాకాలం, యాసంగిల్లో పెంచిన రుణపరిమితిని అమలు చేయనుండగా జిల్లా రైతులకు 10 శాతం వరకు అధిక మొత్తం పెట్టుబడి రూపేణా దరిచేరనుంది.

అమలుపైనే అన్నదాతల ఆశలు

దాదాపుగా 123 రకాలైన పంటలతో పాటుగా పాడి, కోళ్లు, గొర్రెలు, మేకలు, పందులు, చేపల పెంపకం యూనిట్లకు, పట్టుపురుగుల పెంపకానికీ రుణాలు ఇవ్వనున్నారు. జిల్లాలో గడచిన వానాకాలం, యాసంగిల్లో పంటరుణాలు, అనుబంధ రుణాల పంపిణీలో 79 శాతంవరకే లక్ష్యాన్ని చేరగలిగారు. వ్యవసాయ అనుబంధ టర్మ్ రుణాలను కూడా అందించటం లక్ష్యంగా ఉన్నా వీటి పంపిణీ 25 శాతం లోపేఉంది. కొన్ని బ్యాంకులు పంట రుణాలను బాగానే ఇస్తున్నా చాలా బ్యాంకులు నిర్దేశిత లక్ష్యంలో వెనుకంజలోనే ఉండటం రైతులకు సాగుసాయాన్ని దూరంచేస్తోంది.

సాగునీటి కల్పన, వ్యవసాయ యాంత్రీకరణ, పాడి పరిశ్రమ, ఎద్దులు,



ఎడ్లబండ్లు, భూముల అభివృద్ధి, విత్తనోత్పత్తి, సేంద్రియసాగు రుణాల్లో చాలావరకు రైతులకు అందటంలేదు. 2023-24లో జిల్లాలో రైతులకు 2,902 కోట్లవరకు పంటరుణాలు, వ్యవసాయ అనుబంధ రుణాల పంపిణీ లక్ష్యంగా ఉండగా నెరవేర్చితేనే రైతులకు ఆర్థిక చేదోడుగా ఉంటుంది. బ్యాంకులు పంటరుణ పరిమితిని పెంచి ఇవ్వటంతో పాటుగా సక్రమంగా రుణాలు చెల్లించిన రైతులకు నిర్దేశిత మొత్తం కన్నా 30 శాతం వరకు కూడా రుణాన్ని పెంచి ఇచ్చే వీలుంది.

జగిత్యాల జిల్లాలో నూతనంగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందినవారు, ఇదివరకు రుణం పొందనివారు దాదాపుగా 20 వేల మందివరకు ఉండగా వీరికీ రుణం అందించాలి. ప్రభుత్వం రూ.లక్ష వరకు గల పంటరుణాలను మాఫీ నిధులను విడుదల చేసినట్లయితే జిల్లా రైతులకు రూ.500 కోట్లవరకు చేతికందుతుంది. పంట రుణాలకు కేంద్రం రాయితీ ఇస్తుండగా రాష్ట్రప్రభుత్వం కూడా వడ్డీరాయితీని కొనసాగించటం, ఇదివరకున్న వడ్డీ బకాయిని రీఎంబర్స్‌మెంటుగా ఇవ్వటంద్వారా రైతులకు మరింత ఆర్థిక ఆసరా కలుగుతుంది.

ప్రభుత్వ పెంపు ప్రకారం..

పొన్న వెంకటరెడ్డి, లీడ్‌బ్యాంకు జిల్లా మేనేజర్, జగిత్యాల

నూతన ఆర్థిక సంవత్సరానికిగాను ప్రభుత్వం అనుమతించిన మేరకు పంటరుణ పరిమితిని పెంచి రైతులకు అధికమొత్తం అందించేలా చర్యలు తీసుకుంటాం. ఇంకనూ పంట రుణాలను పొందనివారు ఆయా మండలాల వ్యవసాయాధికారులను సంప్రదించాలి.




# ఏపీ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ..

దిల్లీ: అంగళ్లు కేసులో ఏపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఘటనలో తెదేపా నేతలకు హైకోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులపై జోక్యం చేసుకునేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన ఆరు వేర్వేరు పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో తెదేపా నేతలకు హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను సమర్థించింది. 'సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి' పేరిట ఆగస్టు 4న అన్నమయ్య జిల్లాలో చంద్రబాబు పర్యటించారు. అంగళ్లు మీదుగా ఆయన వెళుతున్నప్పుడు వైకాపా శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడడం, తెదేపా కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొన్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో తెదేపా అధినేత చంద్రబాబు సహా ఆ పార్టీకి చెందిన మొత్తం 179 మంది నేతలపై కురబలకోట మండలం ముదివేడు పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో పలువురు తెదేపా నేతలను అరెస్ట్ చేశారు. దీనిపై వారు హైకోర్టును ఆశ్రయించగా.. విచారణ అనంతరం కొందరికి బెయిల్ లభించింది. హైకోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులపై ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆరు వేర్వేరు పిటిషన్లను దాఖలు చేసింది. తెదేపా నేతలు దేవినేని ఉమామహేశ్వరరావు, చల్లా రామచంద్రారెడ్డి అలియాస్ బాబు, నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిలకు మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేయాలని కోరింది. చల్లా బాబుకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం నాలుగు పిటిషన్లు దాఖలు చేసింది. విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌పై జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేది ధర్మాసనం పలు అనుమానాలు వ్యక్తం చేసింది. ఘటన జరిగిన నాలుగు రోజుల తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేయడం అభ్యంతరం తెలిపింది. భద్రత కల్పించే పోలీసులే.. సాక్షులుగా ఎఫ్ఐఆర్ ఏంటని ధర్మాసనం ప్రశ్నించింది. పోలీసు అధికారులు గాయపడ్డారని.. ఓ కానిస్టేబుల్ ఫిర్యాదుదారుగా ఉన్నారని ఏపీ ప్రభుత్వ న్యాయవాది చెప్పారు. స్పందించిన ధర్మాసనం పోలీసులే ఎఫ్ఐఆర్ నమోదు చేసి... పోలీసులే సాక్షులుగా ఉంటారా? అని ప్రశ్నించింది. హైకోర్టు బెయిల్ ఇచ్చినందున దీనిలో జోక్యం చేసుకోడానికి ఏమీ లేదని స్పష్టం చేసింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసి ఆరు వేర్వేరు పిటిషన్లను కొట్టివేసింది.

# చంద్రబాబు ఆరోగ్యంగా.. ధైర్యంగా ఉన్నారు



రాజమండ్రి: టీడీపీ అధినేత చంద్రబాబు జైలులో ఆరోగ్యంగా ఉన్నారని.. ధైర్యంగా ఉన్నారని ఎమ్మెల్యే చినరాజప్ప తెలిపారు. మంగళవారం చంద్రబాబుతో రాజమండ్రి సెంట్రల్ జైలులో నారా భువనేశ్వ, బ్రహ్మణి, చినరాజప్ప ములాఖత్ అయ్యారు. అనంతరం చినరాజప్ప మీడియాతో మాట్లాడుతూ.. కార్యకర్తలను దైర్యంగా ఉండమని చెప్పారన్నారు. చంద్రబాబుకు బెయిల్ రాకుండా జగన్ కుయుక్తులు పన్నుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రం కోసమే చంద్రబాబు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. మాజీ మంత్రి బండారు సత్యానారాయణను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌లో ఇబ్బంది పెడుతున్నారన్నారు. జనసేన, టీడీపీ పొత్తుపై ఉమ్మడి కార్యాచరణతో వెళ్ళాలని చంద్రబాబు చెప్పారని చినరాజప్ప పేర్కొన్నారు.




దిల్లీ: ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసుతో భారత్, కెనడా మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత్‌లో వారి దౌత్య సిబ్బంది సంఖ్యను తగ్గించుకోవాలని కెనడాకు న్యూదిల్లీ అల్టిమేటం జారీ చేసినట్లు తెలుస్తోంది. అక్టోబరు 10లోగా దాదాపు 40 మంది దౌత్య సిబ్బందిని వెనక్కి పిలిపించుకోవాలని ఒట్టావాకు చెప్పినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఫైనాన్షియల్ టైమ్స్ కథనం వెల్లడించింది. దౌత్యసిబ్బంది సంఖ్య విషయంలో సమానత్వం ఉండాల్సిన అవసరముందని భారత్ గతంలోనూ కెనడాకు సూచించిన విషయం తెలిసిందే. ఇటీవల నిజ్జర్ హత్యపై కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన భారత్ విదేశాంగ శాఖ.. దిల్లీలో కెనడా దౌత్యవేత్తల అంశాన్ని కూడా ప్రస్తావించింది. ఒట్టావాలోని భారత దౌత్యసిబ్బంది సంఖ్యతో పోలిస్తే దిల్లీలో కెనడా దౌత్య సిబ్బంది సంఖ్య చాలా ఎక్కువగా ఉందని, దాన్ని సమస్థాయికి తీసుకురావాలని విదేశాంగశాఖ స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే తాజాగా భారత్.. దౌత్యసిబ్బందిని తగ్గించుకోవాలంటూ కెనడాకు డెడ్‌లైన్ విధించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దిల్లీలో కెనడాకు చెందిన 62 మంది దౌత్యసిబ్బంది ఉన్నారు. అందులో 41 మందిని ఒట్టావా వెనక్కి పిలిపించుకోవాలని చెప్పినట్లు సమాచారం. అక్టోబరు 10లోగా ఈ ప్రక్రియ పూర్తి కావాలని దిల్లీ స్పష్టం చేసిందట. ఆ తేదీ దాటిన తర్వాత కూడా అదనంగా ఉన్న సిబ్బందికి దౌత్యపరమైన రక్షణను తొలగిస్తామని భారత్ హెచ్చరించినట్లు సదరు కథనం వెల్లడించింది. అయితే, ఈ వార్తలపై అటు కెనడా విదేశాంగ శాఖ నుంచి గానీ, ఇటు భారత ప్రభుత్వం నుంచి గానీ ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.

నిజ్జర్ హత్య కేసులో భారత ఏజెంట్ల హస్తం ఉందంటూ ట్రూడో చేసిన ఆరోపణలతో ఈ దౌత్య వివాదం రాజుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కెనడాలో మన దౌత్యవేత్తపై బహిష్కరణ వేటు పడింది. అయితే, ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించిన భారత్.. కెనడా చర్యకు ప్రతిగా కెనడా దౌత్యవేత్తను దేశం నుంచి బహిష్కరించింది. మరోవైపు, ఉద్రిక్తతల నేపథ్యంలో కెనడా వాసులకు వీసా సర్వీసులను కూడా భారత్ నిలిపివేసింది.




దిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్‌ల్లో నిన్న జాతీయ దర్యాప్తు సంస్థ అదుపులోకి తీసుకొన్న ఐసిస్ ఉగ్రవాదులందరూ ఉన్నత విద్యావంతులే. ఈ విషయాన్ని దిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ సీనియర్ అధికారి హెచ్‌జీఎస్ దాలివాల్ వెల్లడించారు. వీరిలో కీలక నిందితుడైన షానవాజ్, అతడి అనుచరులు రిజ్వాన్ అష్రాఫ్, మొహమ్మద్ అర్షద్ వార్సి ఇప్పటికే దేశవ్యాప్తంగా రెక్కీలు నిర్వహించినట్లు కూడా వెల్లడించారు.

**మైనింగ్ రంగంలో అనుభవంతో ఉగ్రవాదం..** ప్రధాన నిందితుడు షానవాజ్ ఝూరండ్‌లోని హజారీబాగ్ ప్రాంతానికి చెందినవాడు. అతడు మైనింగ్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. ఇంజినీరింగ్ బ్లాస్టులపై అతడికి మంచి అనుభవం ఉంది. అతడు మతాంతర వివాహం చేసుకొన్నాడు. ప్రస్తుతం అతడి భార్య కూడా పరారీలో ఉంది. ఈ కేసులో మరో నిందితుడు మహమ్మద్ అర్షద్ వార్సి కూడా ఝూర?ండ్‌కు చెందిన వాడే. ఇతడు అలీగఢ్ యూనివర్సిటీలో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశాడు. ప్రస్తుతం దిల్లీలోని జామియా మిలియాలో పీహెచ్‌డీ చేస్తున్నాడు. మూడో నిందితుడైన రిజ్వాన్ కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ పూర్తి చేశాడు. ఇతడిది ఉత్తరప్రదేశ్‌లోని ఆజమ్‌గఢ్. ఇతడు మతగురువుగా శిక్షణ పొందాడు. ఈ అరెస్టులపై దిల్లీ పోలీసుశాఖకు చెందిన దాలివాల్ మాట్లాడుతూ.. "దేశవ్యాప్తంగా పాపులర్ వ్యక్తులను చంపేలా, అత్యధిక మంది మరణించేలా పేలుళ్లు జరపాలనే లక్ష్యంతో పనిచేస్తున్న ఐసిస్ మాడ్యూల్‌ను ఛేదించేందుకు ప్రస్తుత దాడులు జరుగుతున్నాయి" అని వెల్లడించారు. నిన్న అరెస్టు చేసిన నిందితుల వద్ద నుంచి ఓ తుపాకీని కూడా స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. షానవాజ్ దిల్లీ స్థావరం నుంచి జిహాద్‌కు సంబంధించిన పుస్తకాలు, రసాయనాలు వంటివి స్వాధీనం చేసుకొన్నామన్నారు. ఇతడు విదేశాల్లోని తన ఐసిస్ హ్యాండ్లర్‌కు నిత్యం సమాచారం పంపేవాడని పోలీసులు చెప్పారు.

**బైక్ దొంగతనానికి యత్నించి దొరికిపోయి..** షానవాజ్‌ను పోలీసులు తొలిసారి నాటకీయ ఫక్కీలో పట్టుకొన్నారు. అతడు మహమ్మద్ ఇమ్రాన్ మహమ్మద్ యూనిస్, మహమ్మద్ యాకూబ్ షేక్ అనే మరో ఇద్దరితో కలిసి పుణేలో ఓ బైక్ దొంగతనానికి యత్నించాడు. ఈ కేసులో అక్కడి పోలీసులు జులైలో వారిని అరెస్టు చేశారు. అనంతరం పోలీసులు వారి ఇళ్లల్లో సోదాలు చేసేందుకు నిందితులను తీసుకెళ్లిన సమయంలో షానవాజ్ పోలీస్ వ్యాన్ దూకి పారిపోయాడు. ఆ సమయంలో వీరి ఇళ్ల నుంచి బాంబుల తయారీకి వాడే పదార్థాలు, బ్యాటరీలు, టైమర్లు, బల్బులు, షోల్డరింగ్ గన్‌లు స్వాధీనం చేసుకొన్నారు. ఈ వ్యవహారం చూసి పోలీసులు ఒక్కసారిగా అప్రమత్తమైపోయారు. విచారణలో యూనిస్, యాకూబ్ మధ్యప్రదేశ్‌కు చెందినవారిగా తెలిసింది. మార్చిలో రాజస్థాన్‌లో దొరికిన కారుబాంబు కేసులో వీరి హస్తం ఉన్నట్లు గుర్తించారు. షానవాజ్ బోప్తాఘాట్ అనే ప్రదేశంలో యాసిడ్ దాచినట్లు గుర్తించి.. పోలీసులు అక్కడ దాడులు నిర్వహించారు. వీరికి మరోసారి భారీగా రసాయనాలు దొరికాయి. దీంతోపాటు దాదాపు 500 జీబీ డేటాను కూడా స్వాధీనం చేసుకొన్నారు. వీటిల్లో బాంబుల తయారీ వీడియోలు, దేశంలోని వివిధ ప్రాంతాల ఫొటోలు ఉన్నాయి. షానవాజ్ ఇప్పటికే కొల్హాపూర్, సంగ్లీ, సతారా ప్రాంతాలకు బృందాలను పంపించి రెక్కీలు నిర్వహించినట్లు తేలింది.




అమరావతి: తెదేపా అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణిని కలిసేందుకు రాజధాని అమరావతి ప్రాంత రైతులు రాజమహేంద్రవరం బయల్దేరి వెళ్లారు.

అయితే మార్గంమధ్యలో పోలీసులు వారిని అడ్డుకున్నారు. మంగళవారం ఉదయం రాజధాని ప్రాంతంలోని తుళ్లూరు, వెలగపూడికి చెందిన రైతులు ప్రత్యేక బస్సులు, సొంత వాహనాల్లో పయనమయ్యారు. అమరావతి రూపశిల్పి చంద్రబాబును వైకాపా ప్రభుత్వం అక్రమంగా జైల్లో పెట్టిందని.. ఇలాంటి సమయంలో తామంతా ఆయన కుటుంబానికి అండగా ఉంటామని రైతులు చెప్పారు. రాజమహేంద్రవరం వెళ్లేందుకు అనుమతి లేదంటూ వీరవల్లి, నల్లజర్ల టోల్‌గేట్ల వద్ద రైతుల బస్సులను పోలీసులు నిలిపేశారు. బస్సు డ్రైవర్‌లను బలవంతంగా దింపేశారు. ఈక్రమంలో పోలీసులు, రైతుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. రాజమహేంద్రవరం వెళ్లేందుకు అనుమతి ఎందుకని ప్రశ్నించారు. తామేమీ పాకిస్థాన్ నుంచి రాలేదని మహిళలు ఆక్రోశించారు. తాము ఎట్టిపరిస్థితిలోనూ రాజమహేంద్రవరం వెళ్లి తీరతామని రైతులు తేల్చిచెబుతున్నారు.

# బండారు మాట్లాడిన దాంట్లో తప్పేమీ లేదు



న్యూఢిల్లీ: చిన్న స్థాయి నేతల నుంచి మాజీ ముఖ్యమంత్రి వరకు కేసులు పెట్టి జైళ్లలో పెడుతున్నారని టీడీపీ నేత చింతమనేని ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం పోలీసుల ద్వారా ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తోందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా అందరినీ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. బండారు సత్యనారాయణ మూర్తికి పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

ఆయన మాట్లాడిన దాంట్లో ఏ తప్పూ లేదని కూడా తాము సమర్థిస్తున్నామన్నారు. నాడు శాసనసభలో టీడీపీ నేతలపై కామెంట్లు చేసినప్పుడు ఏం చేశారని ప్రశ్నించారు. స్పీకర్‌ను పక్కన పెట్టుకుని మాట్లాడినప్పుడు ఎందుకు ఖండిచలేదని నిలదీశారు. ఇప్పుడు రోజాపై కామెంట్ చేస్తే మాత్రం తప్పుగా కనిపించిందా అంటూ మండిపడ్డారు. ముందు సభలో మాట్లాడిన వైసీపీ సభ్యులను సస్పెండ్ చేయాలని చింతమనేని ప్రభాకర్ డిమాండ్ చేశారు.

# నిజంగా క్లాస్ వార్ చేస్తుంది జగనే...



కృష్ణా: మచిలీపట్నంలో నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దృష్టి అనేక సమస్యలు వచ్చి చేరాయి. జనసేన అధినేతను కలిసిన విద్యుత్ మీటర్ రీడర్లు.. పని భారం పెంచి పొమ్మనకుండా పొగ పెడుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. జగన్ అధికారం కోసం ఇష్టం వచ్చినట్లు హామీలు ఇచ్చారన్నారు. పాదయాత్రలో నోటికి ఏదొస్తే అది వాగ్దానం చేశారని.. ఇప్పుడు అమలు చేయకుండా అందరినీ మోసం చేశారని విమర్శించారు. క్లాస్ వార్ అని మాట్లాడే జగన్ అసలు ఉద్దేశం ఏంటని ప్రశ్నించారు. నిజంగా క్లాస్ వార్ చేస్తుంది జగనే అని అన్నారు. పేదలకు అండగా ఉండకుండా మాటలతో మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలకు భారం తప్ప, ప్రయోజనం లేదన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేసే బాధ్యతను జనసేన తీసుకుంటుందని తెలిపారు. "మీకు న్యాయం జరిగేలా నా వంతు కృషి చేస్తా" అంటూ పవన్ హామీ ఇచ్చారు. అనంతరం మచిలీపట్నం హిందూ కళాశాలను పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ పవన్‌కు విద్యార్థి సంఘాలు వినతి చేశారు. హిందూ జాతీయ కళాశాలను దేవాదాయ శాఖకు ఇచ్చినట్లు విద్యార్థి సంఘాలు చెప్పారు. దాతలు కళాశాల కోసం ఇచ్చిన స్థలాన్ని ఎండోమెంట్‌కు ఎలా ఇచ్చారని పవన్ ప్రశ్నించారు. దాతాలు ఏ ఉద్దేశంతో ఇస్తారో వాటికే సద్వినియోగం చేయాలన్నారు. జగన్ ప్రభుత్వం వచ్చాక ఎయిడెడ్ విద్యా సంస్థలు రద్దు చేశారన్నారు. అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వం కళాశాల భూములను రియల్ ఎస్టేట్ కోణంలో చూస్తున్నారని మండిపడ్డారు. విద్యకు ప్రాధాన్యత అనేది జగన్ ప్రభుత్వం మాటలకే పరిమితం అయ్యిందని పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు చేశారు.

# ఢిల్లీకి జగన్: అన్ని విషయాలపై...

న్యూఢిల్లీ: ఏపీలో రాజకీయాలు హీటెక్కాయి. స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో తెలుగుదేశం పార్టీ అధినేత, ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు అరెస్ట్ అనంతరం ఆ పార్టీలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటూ వస్తోన్నాయి. ఈ ఘటన తరువాత టీడీపీతో పొత్తును ప్రకటించింది జనసేన పార్టీ. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేష్ దేశ రాజధానిలో మకాం వేశారు. మూడు వారాలుగా ఆయన అక్కడే ఉంటోన్నారు. చంద్రబాబు అరెస్ట్ వ్యవహారాన్ని జాతీయ స్థాయిలో తీసుకెళ్లడానికి ప్రయత్నాలు సాగిస్తోన్నారు. అవేవీ పెద్దగా ఫలిస్తోన్నట్లు కనిపించట్లేదు. ప్రస్తుతం నారా లోకేష్ ఢిల్లీలోనే ఉంటోన్నారు. ఈ పరిస్థితుల మధ్య ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి.. హస్తిన పర్యటనకు బయులుదేరి వెళ్లబోతోండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ నెల 6వ తేదీన జగన్ ఢిల్లీ ఫ్లైట్ ఎక్కనున్నారు. రెండు రోజుల పాటు ఆయన అక్కడే ఉంటారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశం కానున్నారు. రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై చర్చించనున్నారు. తన ఢిల్లీ పర్యటన సందర్భంగా వైఎస్ జగన్- కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతోనూ భేటీ అవుతారు. ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్, జల్‌శక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురిని కలిసే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పోలవరం ప్రాజెక్ట్ బకాయిల విడుదల, విశాఖపట్నంలో మెట్రో రైలు కారిడార్ అభివృద్ధి.. వంటి అంశాలపై వైఎస్ జగన్ వారి దృష్టికి తీసుకెళ్లనున్నారు. ఏపీ పునర్విభజన చట్టంలో పొందుపరిచిన హామీల అమలు గురించి ప్రధాని మోదీ, ఆయన మంత్రి వర్గ సహచరులకు ఓ మెమొరాండం ఇవ్వనున్నారు. గతంలో ఐటీ అధికారులు చంద్రబాబుకు నోటీసులు ఇవ్వడం, స్కిల్ డెవలప్మెంట్ కుంభకోణం, ఫైబర్ గ్రిడ్, అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్, అసైన్డ్ భూముల కేసులపై అటు ఏపీ సీఐడీ అధికారులు తమ దర్యాప్తును ముమ్మరం చేయడం ప్రస్తుత పరిస్థితుల్లో వైఎస్ జగన్.. ప్రధాని మోదీ, అమిత్ షాతో భేటీ కాబోతోండటం చర్చనీయాంశమౌతోంది.




# సహజ వనరుల దోపిడీలో కాంగ్రెస్ రికార్డు: మోదీ ధ్వజం



రాయ్‌పుర్: సహజ వనరుల దోపిడీలో కాంగ్రెస్ పార్టీకి ట్రాక్ రికార్డు ఉందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. త్వరలో ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ మంగళవారం అక్కడ పర్యటించిన ప్రధాని రూ.26వేల కోట్లకు పైగా పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారు. బస్తర్‌లోని నగర్నార్‌లో ఉక్కు పరిశ్రమను జాతికి అంకితం చేసిన సందర్భంగా మోదీ ప్రసంగించారు. రాష్ట్రాలు, జిల్లాలు, గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలన్న భారత్ కల సాకారమవుతుందన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ పాలనపై విరుచుకుపడిన ప్రధాని.. రాష్ట్రంలో అవినీతి, నేరాలు అధికంగా ఉన్నాయని.. ఈ విషయాల్లో రాజస్థాన్‌తో పోటీ పడుతున్నారంటూ ఎద్దేవాచేశారు. అటల్ బిహారీ వాజ్‌పేయీ సారథ్యంలోని భాజాపా ప్రభుత్వ హయాంలోనే ఆదివాసీల కోసం ప్రత్యేక మంత్రిత్వశాఖ, బడ్జెట్‌ను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. దశాబ్దాల కాలంగా కాంగ్రెస్ పార్టీ బస్తర్‌ను నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్‌ను నడుపుతున్నది ఆ పార్టీ నేతలు కాదని.. దేశ వ్యతిరేక శక్తులతో అనుబంధం ఉన్నవారు నడుపుతున్నారంటూ విమర్శలు గుప్పించారు. నగర్నార్‌లో ఉక్కు పరిశ్రమ వల్ల బస్తర్, పరిసర ప్రాంతాల్లోని దాదాపు 50వేల మంది యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. తాను ప్రారంభించిన, శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులు ఛత్తీస్‌గఢ్ అభివృద్ధిని వేగవంతం చేస్తాయని.. కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయన్నారు. తద్వారా రాష్ట్రానికి కొత్త సంస్థలు వచ్చేలా ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో భాజపాను గెలిపిస్తే ఇదే వేగంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తామని మోదీ హామీ ఇచ్చారు.

# సిమ్లా యాపిల్ లా సిమ్రాన్ చౌదరి గ్లామర్ డోస్

హమ్ తుమ్ సినిమాతో హీరోయిన్ గా టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన అందాల భామ సిమ్రాన్ చౌదరి. అందాల పోటీలలో పాల్గొనే మోడల్ గా కెరియర్ స్టార్ట్ చేసిన ఈ అమ్మడు మిస్ ఇండియా తెలంగాణగా కూడా ఎంపికైంది. 2018లో తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో చేసిన ఈ నగరానికి ఏమైంది సినిమా సిమ్రాన్ చౌదరికి కొంత గుర్తింపు తీసుకొచ్చింది. బొంబాట్ సినిమాలో ఒక హీరోయిన్ గా నటించింది. నితిన్ చెక్, విశ్వక్ సేన్ పాగల్ మూవీస్ లో కూడా సిమ్రాన్ చౌదరి నటించిన పూర్తిస్థాయి హీరోయిన్ పాత్ర కాదు. చివరిగా గత ఏడాది సెహరి చిత్రంలో హీరోయిన్ గా ఈ హైదరాబాదీ ముద్దుగుమ్మ కనిపించింది. ప్రస్తుతం అథర్వ అనే చిత్రంలో నటిస్తోంది. ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. సినిమాల ద్వారా వచ్చిన గుర్తింపు కంటే సిమ్రాన్ చౌదరికి సోషల్ మీడియాలో ద్వారానే ఎక్కువ పాపులారిటీ వచ్చింది. రెగ్యులర్ గా ఈ బ్యూటీ తనకి సంబందించిన గ్లామర్ ఫోటోలని ఇన్ స్టాగ్రామ్ లో పంచుకుంటూ ఉంటారు. ఈ



ఫోటోలు కూడా విపరీతంగా వైరల్ అవుతాయి. గ్లామర్ షో విషయంలో బాలీవుడ్ భామలకి ఏ మాత్రం తీసిపోని రీతిలో సిమ్రాన్ చౌదరి కూడా హాట్ హాట్ ఫోటోషూట్ లతో సందడి చేస్తూ ఉంటుంది. ఈ కారణంగా సోషల్ మీడియాలో సిమ్రాన్ చౌదరికి మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ కూడా ఉంది. తాజాగా ఈ బ్యూటీ మరో ఇంటరెస్టింగ్ ఫోటోషూట్ ని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది. స్లీవ్ లెస్ జాకెట్ వేసుకొని సోఫాలో కూర్చొని పైకి చూస్తూ చూపులతో వలపుల బాణాలు విసిరుతోంది. అందాలని నిండుగా చూపిస్తూ కుర్రకారుకి హీట్ పెంచేస్తోంది. ఈ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. ఈ స్థాయిలో గ్లామర్ షో చేస్తూ ఉంటే బాలీవుడ్ సినిమాలలో అవకాశాలు తన్నుకురావడం గ్యారెంటీ అనే మాట వినిపిస్తోంది. సిమ్రాన్ చౌదరి డిజిటల్ ఎంట్రీ ఇవ్వడం కోసం కూడా వెయిట్ చేస్తోంది. సరైన బ్రేక్ ఇచ్చే సినిమా పడితే ఈ అమ్మడు అందానికి కచ్చితంగా స్టార్ హీరోయిన్ అయిపోవడం ఖాయం అని ఈ ఫోటోలు చూస్తున్నవారు అంటున్నారు.

# రౌడీ స్టార్ ఎన్ని సినిమాలు లైన్ లో పెట్టాడో తెలుసా?

రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ లైగర్ తర్వాత చాలా గ్యాప్ తీసుకొని ఖుషి మూవీతో ప్రేక్షకుల ముందుకి వచ్చారు. ఈ చిత్రం ఏవరేజ్ టాక్ తెచ్చుకుంది. మళ్ళీ ఈ ఏడాదిలో విజయ్ దేవరకొండ నుంచి మూవీ వచ్చే ఛాన్స్ అయితే లేదు. కానీ వచ్చే ఏడాది రెండు సినిమాలు కచ్చితంగా రిలీజ్ అయ్యేలా ప్లాన్ చేసుకున్నాడు. అందులో భాగంగా ఇప్పటికే దిల్ రాజు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ లో పరశు రామ్ దర్శకత్వంలో సినిమా సెట్స్ పైకి తీసుకొని వెళ్ళాడు. అలాగే సితారా ఎంటర్టైన్మెంట్స్ లో గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో యాక్షన్ బ్యాక్ డ్రాప్ స్టోరీ కూడా సెట్స్ పైన ఉంది. ఈ ఇందులో పరశు రామ్ సినిమాని సంక్రాంతికి రిలీజ్ చేసే ఛాన్స్ కనిపిస్తోంది. అయితే ఈ రెండు మాత్రమే కాకుండా దిల్ రాజు ప్రొడక్షన్ లో మరో రెండు సినిమాలకి కూడా విజయ్ ఒప్పందం చేసుకున్నాడంట. అందులో



కొత్త డైరెక్టర్ తో ఒక సినిమా ఉండనుంది. అలాగే ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో జటాయు మూవీ కూడా పాన్ ఇండియా రేంజ్ లో వంద కోట్లకి పైగా బడ్జెట్ తో తెరకెక్కించడానికి దిల్ రాజు సిద్ధం అవుతున్నారు. మరో వైపు మైత్రీ మూవీ మేకర్స్ లో విజయ్ దేవరకొండ రెండు సినిమాలకి అగ్రిమెంట్ చేసుకున్నట్లు తెలుస్తోంది. వీటిలో ఒక సినిమా కోసం మలయాళీ దర్శకుడు టిను పపాంచన్ విజయ్ కి స్టోరీ నేరేట్ చేయడం కూడా జరిగింది. ఈ స్టోరీ నచ్చడంతో విజయ్ ఒకే చెప్పాడంట. అలాగే సందీప్ వంగా కూడా గతంలో విజయ్ దేవరకొండతో ఒక సినిమా చేస్తానని, అయితే అది నెక్స్ట్ లెవల్ లో ఉంటుందని క్లారిటీ ఇచ్చాడు. ఇలా విజయ్ చేతిలో ప్రస్తుతం అరడజను సినిమాలకి పైగా ఉండటం విశేషం. ఈ సినిమాల జాబితా చూసుకుంటే మరో మూడు, నాలుగేళ్ల తర్వాత విజయ్ దేవరకొండ ఖాళీ అయ్యే ఛాన్స్ లేదు. ఏడాదికి రెండు సినిమాలు ప్రేక్షకుల ముందుకి తీసుకొచ్చే ప్లాన్ రౌడీ స్టార్ విజయ్ చేసుకుంటున్నాడు. అందులో భాగంగానే ఇలా వరుస ప్రాజెక్ట్స్ కి కమిట్ అయినట్లు తెలుస్తోంది.




# మరోసారి ఈ సెంటిమెంట్ వర్కౌట్ అయ్యేనా?




నందమూరి బాలకృష్ణ అనిల్ రావిపూడి దర్శకత్వంలో చేస్తున్న భగవంత్ కేసరి సినిమా అక్టోబర్ 19వ తేదీన వరల్డ్ వైడ్ గా గ్రాండ్గా విడుదల కాబోతోంది. అయితే ఈ సినిమాకు సంబంధించిన టీజర్ తో పాటు సాంగ్స్ కూడా విడుదల చేశారు. ఇప్పుడు మరొక సాంగ్ కూడా విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు. భగవంథ్ కేసరి సినిమా ను దర్శకుడు అనిల్ తన టైమింగ్ ఎంటర్టైన్మెంట్ తో పాటు మంచి యాక్షన్ డోస్ ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకున్నట్లుగా తెలుస్తోంది. బాలకృష్ణ కటౌట్ కి తగ్గట్టుగా కూడా సీరియస్ సీన్స్ ఉన్నాయని పోస్టర్ల ద్వారా నే తెలియజేశారు. ఇక సినిమాపై మంచి బజ్ పెరిగే విధంగా సాంగ్స్ అలాగే పోస్టర్లు మేకింగ్ వీడియోలు వరుసగా విడుదల చేస్తున్నారు. ఇక థమన్ సాంగ్స్ అయితే ఇప్పటివరకు అనుకున్నంత స్థాయిలో అయితే క్లిక్ కాలేదు. ఇప్పుడు మరొక సాంగ్ను విడుదల చేయడానికి రెడీ అవుతున్నారు. ఉయ్యాల ఉయ్యాల అనే కొత్త పాట అక్టోబర్ 4వ తేదీన విడుదల చేయబోతున్నట్లు ఒక ప్రత్యేకమైన పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. అందులో నందమూరి బాలకృష్ణ పక్కన ఒక చిన్నారి పాప కూర్చున్నట్లుగా ఉంది. ఇక బాలకృష్ణ కూతురిగా ఈ సినిమాలో శ్రీలీల నటిస్తోంది అని ముందుగానే క్లారిటీ ఇచ్చేశారు. ఇక తనే ఆ పాప అయ్యి ఉంటుంది అని అర్థమవుతుంది. ఇక చిన్నారి పాపల సెంటిమెంట్ అనేది ఇప్పటివరకు నందమూరి హీరోలకు బాగా కలిసి వచ్చిన అంశమే. ఎందుకంటే అఖండ సినిమాలో బాలయ్య బాబు కూడా చిన్నారి పాపతో చేసిన సీన్స్ బాగా వర్కౌట్ అయ్యాయి. అలాగే జూనియర్ ఎన్టీఆర్ RRR సినిమాలో కూడా పాప కోసమే బ్రిటిష్ వాళ్లతో రామ్ చరణ్తో పోరాటం హైలైట్ అయింది. ఇక మరో నందమూరి హీరో కళ్యాణ్ రామ్ బింబిసార సినిమాలో కూడా మేజర్ కథ చిన్నారి పాప చుట్టే తిరుగుతూ ఉంటుంది. ఈ విధంగా నందమూరి హీరోల సినిమాలలో చిన్నారి పాప పాయింట్ ఉంది అంటే ఆ సినిమా సక్సెస్ అయినట్లే అని సెంటిమెంట్ గా భావిస్తున్నారు. ఇక ఈసారి అనిల్ రావిపూడి శ్రీలీల కు సంబంధించిన చిన్నారి ఎపిసోడ్స్ ను కూడా ఈ సినిమాలో హైలెట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మరి ఈసారి ఈ సెంటిమెంట్ భగవంథ్ కేసరికి వర్కౌట్ అవుతుందో లేదో చూడాలి.

# అందాల బాంబ్ పేల్చిన సీరియల్ నటి




ఒకప్పుడు హీరోయిన్స్ మాత్రమే అందాల ఆరబోత చేసేవారు. కానీ సోషల్ మీడియా పుణ్యమా అని సీరియల్ హీరోయిన్స్.. సోషల్ మీడియా సెలబ్రిటీస్ ప్రతి ఒక్కరు కూడా అందాల ఆరబోత చేస్తూ నెటిజెన్స్ కి కన్నుల విందు చేస్తున్నారు. తాజాగా గుప్పెడంత మనసు నటి తన అందాలతో కనుల విందు చేసింది. జ్యోతి రాయ్ బుల్లి తెరపై పద్ధతి అయిన చీర కట్టులో కనిపించి చూడగానే నమస్కారం పెట్టాలి అనిపించేంత సంస్కారంతో కనిపించింది.

-కాని సోషల్ మీడియాలో మాత్రం బాలీవుడ్ హీరోయిన్స్ కూడా తన ముందు దిగదుడుపే అన్నంతగా అందాల ఆరబోత చేస్తూ అందరికీ షాక్ ఇచ్చింది. ఈ రేంజ్ అందాల ఆరబోత కేవలం స్టార్ హీరోయిన్స్ కి మాత్రమే సాధ్యం అన్నట్లుగా కొందరు కామెంట్ చేస్తుంటే మరి కొందరు మాత్రం బుల్లి తెరపై ఎంతో పద్ధతిగా కనిపించి సోషల్ మీడియాలో మరి ఇంత విచ్చలవిడిగా అందాల ఆరబోత అవసరమా అన్నట్లుగా కామెంట్ చేస్తున్నారు. మొత్తానికి బుల్లి తెర, సోషల్ మీడియా రెండు విభిన్నమైన ప్లాట్ఫార్మ్ లో అందాల ఆరబోత విషయంలో పూర్తి వైవిధ్యాన్ని కనబరుచుతున్న నటి జ్యోతి రాయ్ ఇతర నటిమనులకు ఆదర్శం అనడంలో సందేహం లేదు. ఈ రేంజ్ అందాల ఆరబోత చేస్తే ముందు ముందు సినిమాల్లో కూడా హీరోయిన్ గా లేదా ఐటమ్ సాంగ్స్ లో అవకాశాలు వచ్చాయి వీలుంది.

# ఈషారెబ్బా అవకాశాలు కావాలనే కాలదన్నింది!

తెలుగమ్మాయి ఈషారెబ్బా కెరీర్ జర్నీ ఎలా ఉందో తెలిసిందే. నటిగా చాలా సినిమాలు చేసింది. కానీ అరవింద సమేత వీరరాఘవ లాంటి పెద్ద సినిమా పడే సరికి అమ్మడికి మంచి పేరొచ్చింది. హీరోయిన్ ఛాన్స్ కాకపోయినా కీలక పాత్ర ఈషారెబ్బాకి మంచి ఐడెంటిటీని తీసుకొచ్చింది. సవ్యసాచి..మోస్ట్ ఎలిబిజు ల్ బ్యాచ్ లర్ లాంటి సినిమాల్లో చిన్న రోల్స్ కి పరిమితమైన అరవింద సమేతలో రోల్ తో మాత్రం ప్రత్యేకంగా ఫోకస్ అయింది. అలాగే కోలీవుడ్ లోనూ రెండు..మూడు సినిమాలు చేసింది. ప్రస్తుతం సుధీర్ బాబు హీరోగా నటిస్తోన్న మామా మశ్చీంద్రలో నటిస్తోంది. ఇది గాక కొన్ని



కొత్త అవకాశాలు చేతిలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే కెరీర్ ప్రారంభించి పదేళ్లు అయినా అనుకున్నంత బిజీ కాలేదు. తాజాగా ఇలా ఖాళీగా ఉండటానికి ఓ కారణం కూడా వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని ఆమె స్వయంగా వెల్లడించింది. అరవింద సమేత తర్వాత అదే తరహా పాత్రలు చాలా సినిమాల్లో వచ్చాయట. కానీ తానే నచ్చక నటించలేదుట. ఒకే రకమైన పాత్రలు చేస్తే కొత్తదనం ఉండదని భావించి వచ్చిన అవకాశాలు వదులుకున్నట్లు తెలిపింది. మూస పాత్రలు చేయడం అంటే తొలి నుంచి నచ్చదట. ఏ పాత్ర చేసినా అందులో కొత్తదనం కోరుకుంటానని.. అలాంటి ఆఫర్లు వచ్చినప్పుడు ఎలాంటి సినిమా అనేది ఆలోచించకుండా సైన్ చేస్తుందిట. ప్రస్తుతం విక్రమ్ ప్రభుతో ఓ సినిమా చేస్తుందిట. ఇందులో తన పాత్ర డిఫరెంట్ గా ఉంటుంది...ప్రేక్షకులకు నచ్చుతుందని ధీమా వ్యక్తం చేసింది. అలాగే తెలుగులో దయా-2 అనే ఓ సిరీస్ లో నటించాల్సి ఉందిట. ఇక మామా మశ్చీంద్రలో హీరోయిన్ గా ఎవరైతే బాగుంటుంది అనుకుంటోన్న సమయంలో ఈషా అయితే బాగుంటుందని సుదీర్ బాబు ఈ పాత్రకు తనని రిఫర్ చేసారుట. అలా ఈ సినిమాలో అమ్మడు అవకాశం అందుకున్నట్లు తెలుస్తోంది.

# పింక్ పీస్ లో శాన్వీ పరిమళించిన వేళ!

యూపీ బ్యూటీ శాన్వి శ్రీవాస్తవ టాలీవుడ్ కి సుపరిచితమే. అమ్మడు పదేళ్ల క్రితమే 'లవ్‌లీ' తో లాంచ్ అయిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత 'అడ్డా'..'రౌడీ' లాంటి చిత్రాల్లో నటించిన అమ్మడు ఆ తర్వాత మళ్లీ కనిపించలేదు. అవకాశాలు రాకపోవడంతో శాండిల్ వుడ్ పై దృష్టి పెట్టింది. అక్కడ మాత్రం బాగానే సినిమాలు చేసింది. ఇదే క్రమంలో మలయాళంలోనూ లాంచ్ అయింది. పనిలో పనిగా మరాఠీలోనూ అదృష్టాన్ని పరీక్షించుకుంది. ప్రస్తుతం బ్యూటీ ఆ మూడు భాషల్లోనూ కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో మళ్లీ టాలీవుడ్ లో కంబ్యాక్ అవ్వాలని ప్రయత్నాలు చేసింది గానీ వర్కౌట్ అవ్వలేదు. అమ్మడి గత ట్రాక్ అడ్డంకిగా మారింది. కొత్త భామలకిచ్చే ప్రాధాన్యత పాత నాయికకి ఇవ్వడం లేదు. ఆ రకంగా ఇక్కడ అవకాశాలు అందుకోలేకపోతుంది. ఇక శాన్వి గ్లామర్ ఎలివేషన్ల గురించి



తెలిసిందే. ఆన్ స్క్రీన్ అయినా..ఆఫ్ స్క్రీన్ అయినా చెలరేగుతుందనడంలో ఎలాంటి సందేహంలో లేదు. పైగా వర్మతో పనిచేసిన అనుభవం కూడా ఉంది కాబట్టి ఎక్స్ ఫోజింగ్ విషయంలో ఏమాత్రం మొహమాటం పడదు. ఇన్ స్టా వేదికగా ఎప్పటికప్పుడు హాట్ ఫోటోలతో సెగలు పుట్టిస్తుంది. క్లీవేజ్..థైషోతో కాక పుట్టిస్తుంది. డిజైనర్ దుస్తుల్లో బ్యూటీతో ఎటాక్ చేస్తుంది. తాజాగా శాన్వీ అలాంటి చర్చకే తెర తీసింది. ఇదిగో ఇక్కడిలో పింక్ కలర్ టూపీస్ లో టాప్ యాంగిల్ లో సెల్ఫీలో అందాలన్నీ బంధించింది. మండే ఎండలో బ్యూటీ ఇలా ఇన్ స్టాలో కి వదిలింది. బుంగమూతి బిగించి ఎండ నెత్తిమీద పడకుండా కళ్లకి తీవ్రత లేకుండా ఇలా చేయి అడ్డంగా పెట్టి సెల్ఫీ బటన్ క్లిక్ మనిపించింది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ అవుతుంది. అభిమానులు తమదైన శైలిలో కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు.

# జగిత్యాల ఎస్పీ ఆఫీస్, డబుల్ బెడ్రూం ఇండ్లను ప్రారంభించిన మంత్రి కేటీఆర్





జగిత్యాల : రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ జగిత్యాల జిల్లాలో పర్యటిస్తున్నారు. జగిత్యాలలో 20 ఎకరాల విస్తీర్ణంలో రూ. 40 కోట్లతో నిర్మించిన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయాన్ని, నూకపెల్లి వద్ద 280 కోట్లతో నిర్మించిన 4,520 డబుల్ బెడ్రూం ఇండ్ల కేసీఆర్ కాలనీని, మార్కెట్ యార్డు ఆవరణలో నిర్మించిన సమీకృత కూరగాయల మార్కెట్‌ను హోంమంత్రి మహమూద్ అలీతో కలిసి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, బాల్క సుమన్, సుంకె రవిశంకర్, విద్యాసాగర్ రావు, ఎంపీ వెంకటేశ్ నేతతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఎన్టీపీసీ విద్యుత్ ప్రాజెక్టును జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ



ఇందూరు: నిజామాబాద్ జిల్లాలో పర్యటించిన ప్రధాని మోదీ.. రూ.8 వేల కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. మనోహరాబాద్ - సిద్దిపేట రైల్వేలైన్‌ను ప్రారంభించారు. ఇప్పటికే పెద్దపల్లి జిల్లాలో సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ తొలి యూనిట్‌ను ప్రారంభించుకున్నట్లు చెప్పిన మోదీ.. త్వరలోనే రెండో యూనిట్ అందుబాటులోకి వస్తుందని హామీ ఇచ్చారు. ఎన్టీపీసీతో రాష్ట్ర ప్రజలకు రూ. 4వేల మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వస్తుందన్నారు. తెలంగాణ ప్రజల కోసం బీబీనగర్‌లో ఎయిమ్స్ నిర్మిస్తున్నట్లు మోదీ చెప్పారు.

**మోదీ సభకు భారీగా తరలివచ్చిన ప్రజలు.. బైపాస్ రోడ్డు మూసివేత**

: నిజామాబాద్ జిల్లాలోని ఇందూరులో భాజపా ఆధ్వర్యంలో జనగర్జన సభ జరుగుతోంది. ఈ సభకు ప్రధాని నరేంద్రమోదీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రధాని మోదీ సభ కావడంతో ప్రజలు, కార్యకర్తలు సభా స్థలానికి భారీగా చేరుకుంటున్నారు. దీంతో సభా ప్రాంగణం అంతా జనంతో నిండిపోయింది. స్థలం లేక సభకు వచ్చే గేట్లను పోలీసులు మూసివేస్తున్నారు. ప్రాంగణం బయట ఉన్న ప్రజలను పోలీసులు వెనక్కి పంపించేస్తున్నారు. స్థలం లేకపోవడంతో ప్రజలు రాకుండా పోలీసులు బైపాస్ రోడ్డును మూసివేశారు.





# గజ్వేల్ గౌరవాన్ని పెంచిన సీఎం కేసీఆర్‌ను లక్ష మెజార్టీతో గెలిపిద్దాం



సిద్ధిపేట : గజ్వేల్‌లో కేసీఆర్ పోటీ చేయడం ఇక్కడి ప్రజలు చేసుకున్న పూర్వజన్మ సుకృతం.గజ్వేల్ గౌరవాన్ని, ప్రతిష్టను కేసీఆర్ పెంచారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి మంత్రి హరీశ్ రావు అన్నారు. మంగళవారం గజ్వేల్ ఆర్య వైశ్య ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ గెలిచిచాక గజ్వేల్‌కు దవాఖాన వచ్చింది. మొన్నటి దాకా గజ్వేల్‌కు గూడ్స్ రైలు వచ్చిందని, ఈ రోజు నుంచి ప్యాసింజర్ రైలు ప్రారంభమైందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వమే వెయ్యి కోట్లు వెచ్చించి సిద్ధిపేట జిల్లాకు రైలు తెచ్చుకున్నామని పేర్కొన్నారు. గజ్వేల్‌లో ఎక్కువ మెజారిటీతో కేసీఆర్‌ను గెలిపిస్తే కామారెడ్డి నుంచి వద్దు గజ్వేల్ లోనే ఉండాలని కేసీఆర్ సారును ఒప్పించే పూచీ నాదని హామీనిచ్చారు. ఆయన ఎక్కడుంటే అక్కడ అనుకున్న దానికంటే అభివృద్ధి ఎక్కువ జరుగుతుందని, లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేసిన ప్రతులు వివిధ వైశ్య సంఘ ప్రతినిధులు మంత్రి హరీశ్ రావుకు అందజేశారు. అలాగే రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని మంత్రి హరీశ్ రావుకు అందజేశారు.

# అబద్ధాల కోరు కేసీఆర్ : ఈటల



నిజామాబాద్: తెలంగాణలో సీఎం కేసీఆర్ అబద్ధాల కోరు అయితే.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన హామీని నిలబెట్టుకునే నేత అని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. నిజామాబాద్ సభలో బీజేపీ నేత ఈటెల రాజేందర్ మాట్లాడుతూ..“ఎన్నికలు రాగానే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తాం అంటున్నారు.

పదేళ్లుగా ఇవ్వని వారు ఇప్పుడు దొంగ ప్రొసీడింగ్స్ ఇస్తున్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే పేదల సొంతింటి కల నెరవేరుస్తాం. ప్రతీ ఇంట్లో ఇద్దరు వృద్ధులకు పెన్షన్లు ఇస్తాం. వేలాదిమంది గల్ఫ్ కార్మికుల కోసం గల్ఫ్ పాలసీ అమలు చేస్తాం. మోదీ ప్రభుత్వం ఇచ్చిన డబ్బులతో పథకాలు పెట్టి అబద్ధాలు చెబుతున్నారు. కేసీఆర్ 1.65లక్షల అప్పు తెలంగాణకు మిగిలించాడు తప్ప రాష్ట్రానికి ఏమీ ఇవ్వలేదు. డబ్బులొస్తాయి.. తీసుకోండి.. ఓటు మాత్రం మాకే వేయండి” అని ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

# కాంగ్రెస్,టీడీపీల నుంచి మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు


హైదరాబాద్ : బీఆర్ఎస్‌లోకి వలసలు వెల్లువలా కొనసాగుతూనే ఉన్నాయి. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్ పార్టీలో స్వచ్ఛందంగా చేరుతున్నారు. తాజాగా జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కోలుకొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్, టీడీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో సోమవారం బీఅర్ఎస్ పార్టీ లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి మంత్రి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత గౌరవం ఉంటుందని, బీఆర్ఎస్ గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుర్నాల రవి, కోతి ప్రవీణ్ గౌడ్, గూడూరు వెంకటేశ్వర్లు, బీసు వెంకటేశ్వర్లు, సంపత్, తదితరులు పాల్గొన్నారు.





# రెండుచోట్లా మైనంపల్లికి బీఆర్ఎస్ చెక్

హైదరాబాద్: మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గ టికెట్ కేటాయించినా ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పార్టీని వీడటాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా పరిగణిస్తోంది. మల్కాజ్‌గిరి నుంచి మైనంపల్లి, మెదక్ నుంచి ఆయన కుమారుడు రోహిత్‌రావు కాంగ్రెస్ అభ్యర్థులుగా వచ్చే ఎన్నికలలో పోటీ చేయడం దాదాపు ఖాయమైంది. ఈ నేపథ్యంలో ఈ రెండు చోట్లా మైనంపల్లిని కట్టడి చేసేందుకు బీఆర్ఎస్ పావులు కదుపుతోంది. అందులో భాగంగా మెదక్ నుంచి టికెట్ ఆశించి భంగపడిన డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మల్కాజ్‌గిరి టికెట్ ఆశించిన నందికంటి శ్రీధర్‌ను బీఆర్ఎస్‌లో చేర్చుకునేందుకు మంతనాలు జరుగుతున్నాయి. మెదక్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఉన్న తిరుపతిరెడ్డి మూడ్రోజుల క్రితం తన పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. తాజాగా మల్కాజ్‌గిరి డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ కూడా కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఏళ్లుగా పార్టీని అంటిపెట్టుకొని సేవలందిస్తున్న తమను కాదని కొత్తగా పార్టీలో చేరిన మైనంపల్లి కుటుంబానికి రెండు టికెట్లు కేటాయించడాన్ని అటు తిరుపతిరెడ్డి, ఇటు నందికంటి శ్రీధర్ ప్రశ్నిస్తున్నారు. కాగా, కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన ఈ ఇద్దరు నేతలను బీఆర్ఎస్‌లో చేర్చుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. బీఆర్ఎస్‌లో తిరుపతిరెడ్డి చేరికకు సంబంధించి మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి నివాసంలో చర్చలు జరిగినట్లు విశ్వసనీయ సమాచారం.






# ఓటుకు కోట్లు కేసులో రేవంత్‌కు సుప్రీంలో చుక్కెదురు

## ఓటుకు కోట్లు కేసు అవినీత నిరోధక చట్టం పరిధిలోకి రాదంటూ రేవంత్ పిటిషన్

## ఆ పిటిషన్‌ను డిస్మిస్ చేసిన సుప్రీంకోర్టు

ఢిల్లీ: ఓటుకు కోట్లు కేసులో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఓటుకు కోట్లు కేసు అవినీతి నిరోధక చట్టం పరిధిలోకి రాదంటూ రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను దేశ సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈరోజు(మంగళవారం) విచారణ చేపట్టింది. ఓటుకు కోట్లు కేసు అవినీతి నిరోధక చట్టం పరిధిలోకి రాదంటూ దాఖలు చేసిన పిటిషన్లను గతంలో హైకోర్టు కొట్టేయడంతో రేవంత్‌రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును సుప్రీంకోర్టు కూడా డిస్మిస్ చేయడంతో రేవంత్‌రెడ్డికి మరోసారి భంగపాటు తప్పలేదు. కాగా, తెలుగు రాష్ట్రాల్లో ఓటుకు నోటు కేసు సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి అనుకూలంగా ఓటు వేయాలని ఎమ్మెల్సీ స్టీఫెన్‌సన్‌ను ప్రలోభాలకు గురిచేసిన విషయం విదితమే. అప్పట్లో టీడీపీలో ఉన్న రేవంత్‌రెడ్డి స్వయంగా స్టీఫెన్‌సన్ ఇంటికి వెళ్లి భారీ మొత్తంలో నగదుతో ప్రలోభాలకు గురిచేసిన వీడియో గతంలో సంచలనం సృష్టించింది. ఈ కేసులో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడిని ముద్దాయిగా చేర్చాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి న్యాయపోరాటం చేస్తున్న క్రమంలో నేడు సుప్రీంలో విచారణకు వచ్చింది.





# మోదీ.. ఎంతకాలం ఈ అబద్ధాల జాతర?: కేటీఆర్

హైదరాబాద్: ప్రధాని మోదీ మంగళవారం నిజామాబాద్‌లో పర్యటించనున్నారు. ఈనేపథ్యంలో రాష్ట్ర మంత్రి కేటీఆర్ ట్విటర్ వేదికగా ఆయనకు కొన్ని ప్రశ్నలు సంధించారు.

“మా మూడు ప్రధాన హామీల సంగతేంటి? కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి ప్రాణం పోసేదెప్పుడు? బయ్యారం ఉక్కు కర్మాగారం నిర్మించేదెప్పుడు? పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా దక్కేదెప్పుడు?మూడ్రోజుల్లో రెండోసారి వస్తున్నారు.. ఆ మూడు విభజన హక్కులకు దిక్కేది? పదేళ్ల నుంచి పాతరేసి ఎంతకాలం ఈ అబద్ధాల జాతర? మీ మనసు కరిగేదెప్పుడు.. తెలంగాణ గోస తీరేదెప్పుడు? గుండెల్లో గుజరాత్ పెట్టుకుని తెలంగాణ గుండెల్లో గునపాలా?కోచ్ ఫ్యాక్టరీ, ఉక్కు కర్మాగారం ఊపిరి తీశారు. లక్షల ఉద్యోగాలిచ్చే ఐటీఐఆర్‌ను ఆగం చేశారు. పసుపు బోర్డు ప్రకటన కూడా మహిళా రిజర్వేషన్‌లాగే ఉంది. తెలంగాణలో మళ్లీ వంద చోట్ల మీ డిపాజిట్ల గల్లంతు గ్యారెంటీ” అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

# రామగుండంలో బీఆర్ఎస్‌కు షాక్

పెద్దపల్లి: రామగుండంలో అధికార పార్టీ బీఆర్ఎసకు గట్టి షాక్ తగిలింది. పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌పై సంధ్యారాణి సంచలన ఆరోపణలు చేశారు. ఎమ్మెల్యే చందర్ తమ కాళ్ళు పట్టుకున్నారన్నారు. కోరుకంటి చందర్‌ను 2018 లో చందాలు వేసుకొని గెలిపించామని చెప్పుకొచ్చారు. చందర్ గెలిచిన తర్వాత రామగుండంలో ఆర్ఎఫ్‌సీఎల్ బూడిద, ఇసుక, ఉద్యోగాలలో కోట్లు దండుకున్నారని ఆరోపించారు. 20 ఏళ్లుగా తనను అవమానపరస్తున్నారంటూ సంధ్యారాణి కంటతడిపెట్టారు. రామగుండం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని ప్రకటించారు. కొంగు చాపి అడుగుతున్న రామగుండం ప్రజలు అవకాశం ఇవ్వాలని సంధ్యారాణి కోరారు.

# అంగన్‌వాడీల సమ్మెపై ప్రభుత్వం స్పందించాలి



సంగారెడ్డి జిల్లా: సదాశివపేటలో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే జగ్గారెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన సంగారెడ్డిలో మీడియాతో మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లను, ఆయాలను పర్మినెంట్ చేయాలని, వారి సమ్మెపై ప్రభుత్వం స్పందించాలని విజ్ఞప్తి చేశారు. గత 15 రోజుల నుంచి అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం ఏం చేసిన ఎన్నికల కోడ్ వచ్చే వరకే చేయాలని, ఎన్నికల కోడ్ వస్తే ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ముఖ్యమంత్రి ఎవరున్న సరే అంగన్‌వాడీల డిమాండ్‌లు అమలు చేయిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టికి అంగన్‌వాడీల సమస్యలను వినిపిస్తామన్నారు. అంగన్‌వాడీల సమ్మెకు కాంగ్రెస్ పార్టీ మద్దతుగా ఉంటుందని, ఇప్పుడు ఈ ప్రభుత్వం అంగన్‌వాడీల డిమాండ్లు నెరవేర్చకపోయినా కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే నెరవేరుస్తామని జగ్గారెడ్డి మరోసారి స్పష్టం చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com